ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

శ్రీ పొట్టి శ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 4 ఏప్రిల్ 2025







శ్రీరామ.. జైజైరామ

6న శ్రీరామ నవమి

జానకీరామ ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

ఈ నెల 6వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని రామ మందిరాల్లో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయాలకు రంగులద్ది, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు, తరలివచ్చే భక్తజనానికి ఏలోటూ రానీయకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం వేడుకలకు ముస్తాబయ్యింది. రామస్తూపం ఉన్న మైదానంలో కల్యాణం జరిపేందుకు చలువ పందిళ్ల వేస్తున్నారు. అలాగే ట్రంకురోడ్డుపై డివైడర్ల మధ్యలో సీతారామ లక్ష్మణులతోపాటు ఆంజనేయుల ప్రతిమలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

రామస్తూపం ఉన్న మైదానంలో ముస్తాబైన సీతారాముల కల్యాణ వేదిక, ట్రంకురోడ్డులోని డివైడర్ల మధ్యలో విద్యుద్దీప వెలుగుల్లో దేవతామూర్తులు



శబరి శ్రీరామక్షేత్రానికి విద్యుద్దీప అందాలు

రైళ్లలో చోరీలపై దర్యాప్తు వేగవంతం

- రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- టోల్‌ప్లాజాల వద్ద సీసీ ఫుటేజ్‌ల సేకరణ
- విజయవాడ రైల్వే స్టేషన్‌లోనూ పరిశీలన
- అనుమానితుల గుర్తింపు

నెల్లూరు(క్రైం)/ బిట్రగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అల్లూరు రోడ్డు వద్ద రైల్లో జరిగిన చోరీ కేసులో నెల్లూరు జీఆర్‌పీఎస్ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. డీఎస్పీ మురళీధర్ పర్య వేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం ఒక బృందం జిల్లాలోని గౌర వరం, వెంకటాచలం టోల్ ప్లాజాల వద్ద సంఘటన జరిగిన గంట ముందు, గంట తర్వాత సీసీ ఫుటేజ్‌లను సేకరించారు. మరో బృందం విజయవాడకు చేరుకొని మధురై ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కిన ప్రయాణికుల సీసీఫుటేజ్‌లను సేకరించారు. ఈ క్రమంలో కొంతమంది అనుమాని తులను గుర్తించినట్లు సమాచారం.

● ఐదు నిముషాల్లో పని పూర్తి

జిల్లాలోని అల్లూరు రోడ్డు సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలును ఆపి దొంగతనానికి పాల్పడిన విధానాన్ని గమనించిన పోలీసులు ఇది తప్పనిసరిగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్ పని అని చెబుతున్నారు. వేసవిలో ఇలాంటి గ్యాంగ్ లు దక్షిణాది రాష్ట్రాలకు వచ్చి ఇలాంటి చోరీలకు పాల్పడి పరారవుతా యని చెబుతున్నారు. ఇలాంటి గ్యాంగ్‌లో ఐదు నుంచి పది మంది లోపు సభ్యులు ఉం టారని తెలుస్తున్నది. ఇలాంటి గ్యాంగ్‌లు రాత్రి పూట మాత్రమే రైలు లో దొంగతనాలు చేస్తాయి. గ్యాంగ్ సభ్యులు ఓ రైలును దొంగతనం చేసేందుకు ఎంపిక చేసుకొని ఆ రైలులో ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేస్తారు. రైల్లో ప్రయాణం చేసే సమయంలోనే ఆ బోగీలో ఎంత మంది ఉన్నారు, ఎవరు మంచి నిద్రలో ఉన్నారు, ఎవరి మెడల్లో ఎంత బంగారు ఉంది...? నగదు ఉన్న బ్యాగులు ఉన్నాయా, సెల్‌ఫోన్‌లు జేబులో పెట్టుకొని నిద్రించే వారు ఎవరు... ఇలా గంటల సమయంలోనే పక్కా ప్లాన్ వేసుకుంటారు. రైలులో ఎక్కిన గ్యాంగ్ సభ్యులు వారి పనిలో వారు ఉంటే రైలు నిలిపే ప్రాంతం లో ఉన్న సభ్యులు ట్యాంపరింగ్‌చేసేందుకు సిద్ధంగా ఉంటారు. వారు ఎంపిక చేసుకున్న రైలు ఎక్కడ వస్తుందో తెలుసుకుంటూ సరిగా రైలు వారి అనుకున్న ప్రాంతంకు వచ్చే ఐదు నిముషాల ముందు సిగ్నెల్ ట్యాంపరింగ్ చేస్తారు. రెడ్ లేదా ఎల్లో సిగ్నిల్ పడుతూనే రైలు ఆగుతుంది. రైలు ఆగిన వెంటనే అప్పటికే పట్టాలపై సిద్ధంగా ఉన్న గ్యాంగ్ సభ్యులు రైలు బోగీల్లోకి ఎక్కుతారు. రైలులో ఉన్న వారు, పట్టాలపై నుంచి ఎక్కిన వారు అందరూ కలిసి అప్పటికే ఎంపిక చేసుకున్న బంగారు చైన్‌లు, సెల్‌ఫోన్‌లు, బ్యాగ్‌లను లాక్కొని రైలు దిగి పరుగులు తీస్తారు. సరిగ్గా మూడు నిమిషాల నుంచి ఐదు నిమిషాల మధ్య దొంగతనం పూర్తి చేస్తారు. ప్రయాణికులు ఎదురు తిరిగినా, వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినా, పట్టాలకు పక్కనే ఉన్న రాళ్లను విసురుతూ తప్పించుకుంటారు. ఇలా వేసవిలో ఈ గ్యాంగ్‌లు వరుస చోరీలకు పాల్పడుతూ దొరికినకాడికి దోచుకుంటారు.



నేడు జిల్లాకు గృహ నిర్మాణశాఖ మంత్రి రాక

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30గంటలకు నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసానికి ఆయన చేరుకుంటారు. 9.30గంటలకు సోమిరెడ్డితో కలిసి తోటపల్లిగూడూరు మండలం వరిగొండలోని లేఅవుట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. 11.30గంటలకు పొదలకూరుకు చేరుకుంటారు. అక్కడ హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడ తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అధికా రులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహి స్తారు. అనంతరం సంతపేటలోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి చేరుకుంటారు. తదుపరి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం ఆరుగంటలకు తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని ఆది శంకర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొం టారు. అక్కడ మహర్షి మహేష్ యోగి విగ్ర హాన్ని ఆవిష్కరిస్తారు. రాత్రి 9గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని హైదరాబాద్‌కు వెళతారు.



గూడు గుట్టు విప్పేనా..!?

- గాడితప్పిన గృహ నిర్మాణశాఖ
- అధికారులతో నేడు మంత్రి పార్థసారథి సమీక్ష

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'పేదలకు సొంతింటి కల నేరవేరుస్తాం... కాలనీలు కాదు.. ఊర్లు ఏర్పాటు చేస్తున్నాం... పేదింటిలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు సొంత ఆస్తిని కల్పిస్తున్నాం'... అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో రూ.వేల కోట్లతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. అంతేకాక పక్కా ఇళ్ల నిర్మాణానికి అప్పటి నాయకులు శ్రీకారం చుట్టారు. ఇక్కడే ఆ నేతలు పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు.

● అక్రమాలకు అంతేలేదు...

జగనన్న కాలనీల పేరుతో తక్కువ ధరకు భూములు కొని, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశారు. పేదల పేరుతో రూ.కోట్ల నిధులను వైసీపీ నేతలు దిగమిం గారు. గృహ నిర్మాణాల పేరుతో ఇసుక, స్టీలు, సిమెంటు వంటి మెటీరియల్ బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకొని పాలకులు, కొంత మంది అధికారులు, ఉద్యోగులు భారీ అక్రమాలకు పాల్పడ్డారు. జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్ల నిధులు ఖర్చు చేశామని చెబుతున్నా, పేదవాడికి మాత్రం సొంతింటి కల నేరవేర లేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న లేఅవుట్లు, పక్కా ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో జిల్లాలోని విజిలెన్స్ యం త్రాంగం అన్ని లేఅవుట్‌ల్లో జరిగిన పక్కా ఇళ్ల నిర్మాణాలపై విచారణ చేపట్టింది. ఈ విచారణలో గత ప్రభుత్వంలో జరిగిన భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాలకు వినియోగించాల్సిన ఇసుక, సిమెంటు, స్టీలు పెద్దఎత్తున మాయమైనట్లు విచారణలో తేలింది.



వెంకటాచలంలోని జగనన్న కాలనీ

● రూ.110 కోట్ల అవినీ

జిల్లాలోని అన్నీ లేఅవుట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు దాదాపుగా రూ.110 కోట్ల మేర నిధులను అటు నాయకులు, కాంట్రాక్టర్లు, ఇటు అధికారులు, ఉద్యోగులు కొల్లగొట్టినట్లు లెక్కలు తేల్చారు. ఇందులో సుమారుగా 300 మందికి పైగా అధికారులు, ఉద్యోగుల పాత్ర ఉన్నట్లుగా తేల్చారు. అయితే అవినీతికి పాల్పడ్డ అధికారులు, ఉద్యోగులు ప్రస్తుత పాలకులను ప్రసన్నం చేసుకుంటుండడంతో భారీ స్థాయిలో అవినీతి బయటపడినా చర్యలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. విజిలెన్స్ అధికారలు ఇచ్చిన నివేదికను ప్రభుత్వ పెద్దలు ఎందుకో పట్టించుకోవడం లేదు. కేవలం జిల్లా యంత్రాంగం అక్కడక్కడ కొంత మేరకు విచారణ జరిపి కలెక్టర్‌కు ఇస్తున్న నివేదికలపై అరకొరగా చర్యలు ఉంటున్నాయి. దీంతో హౌసింగ్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభత్వ పెద్దలు ఆ తర్వాత దాన్ని పక్కన పెట్టారు. దీంతో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటున్నారు.

లేఅవుట్లలో అక్రమాలు నిజమే..!

- నివాసయోగ్యం కాని భూముల్లో పేదలకు పట్టాలు
- అధిక ధరలకు పొలాల కొనుగోలు
- విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన నిజాలు
- కొనసాగుతున్న డ్వామా అధికారుల విచారణ

నెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వేసిన లేఅవుట్ల మాటున భారీ అక్రమాలు జరిగాయని నిర్ధారణ అయ్యింది. తక్కువ ధర ఉన్న భూములను ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం, నివాసయోగ్యం కాని చోట లేఅవుట్లు వేయడం వంటి అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. అంగేకాక లేఅవుట్లలో లెవలింగ్ పేరుతో కూడా భారీ దోపిడీ జరిగినట్లు డ్వామా అధికారుల విచారణలో బయటపడింది.

● తొలి నుంచి ఆరోపణలు

పేదల ఇళ్ల స్థలాల వ్యవహారంలో మొదటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరు ద్ధంగా భారీ ధరలు ఖరారు చేసి దోచిపెట్టారన్న ప్రచారం జరిగింది. నివాస యోగ్యం కాని భూములను కూడా అధిక ధరలతో కొనుగోలు చేశారన్న ఫిర్యాదులున్నాయి. అప్ప ట్లోనే ఎన్ని ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న వారు లేరు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 852 లేఅవుట్లు వేయగా, అందుకు 2832 ఎకరా లను వినియోగించారు. ఇందులో 1052 ఎకరాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి భూసే కరణ ద్వారా తీసుకున్నారు. ఇందుకు రూ.210 కోట్లు ఖర్చు చేశారు. ఈ కొను గోలుకు ప్రభుత్వం కొన్ని విధివిధా నాలు రూపొందించింది. కానీ చాలా చోట్ల అవేవీ పాటించలేదని ఆ లేఅవుట్లను చూస్తేనే అర్థమ వుతోంది. తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థాయి వరకూ ప్రతీ ఒక్కరూ ఇందులో పాత్రధారులుగా ఉన్నారు.

● పేదల ఇళ్లపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో అనేక చోట్ల నివాసానికి పనికి రాని లేఅవుట్లను వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఈ లేఅవుట్లకు అవసరమైన భూమి కొనుగోలు దగ్గర నుంచి ఆ భూమిని చదును చేయడం వరకూ అవినీతి జరిగిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే భూమి కొనుగోళ్లు, లేఅవుట్ల స్వభావంపై విచారణకు విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమిని కొనుగోలు చేసి వేసిన లేఅవుట్లను పరిశీలించగా నాలుగో వంతు లేఅవుట్లలో అవకతవకలు గుర్తించారు. కొన్ని అధిక ధరలకు కొనుగోలు చేయగా, మరికొన్ని చెరువులు, శ్మశానాలు ఆనుకొని వేశారని తేల్చారు. ఇక్కడ నివాసం ఉండేందుకు పేదలు ముందుకు రావడం లేదని, దాని ఫలితంగా రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.



● చదును పేరుతో దోపిడీ

ఉమ్మడి జిల్లా పరిధిలో డ్వామా నుంచి 1170 లేఅవుట్లను గ్రావెల్‌తో చదును చేసినట్లుగా చూపించి ఇప్పటికి సుమారు రూ.60 కోట్లను బిల్లులుగా తీసేసుకున్నారు. ఎంబుక్‌ల ప్రకారం ఇంకా రూ.33 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే చాలా లేఅవుట్లలో లెవలింగ్ అవసరం లేకపోయినప్పటికీ పైపైనే లెవలింగ్ చేసి భారీగా బిల్లులు పెట్టుకున్నట్లు అధికారుల విచారణలో బయటపడింది. లేఅవుట్ల చదునుకు గానూ క్యూబిక్ మీటర్ గ్రావెల్‌కు రూ.135 చెల్లించేలా వైసీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. అప్రూవ్డ్ క్వారీ నుంచి తీసుకొచ్చిన గ్రావెల్‌కే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా తహసీల్దార్ల అనుమతితో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్‌ను తీసుకెళితే రూ.50 తగ్గించి క్యూబిక్ మీటర్‌కు రూ.85 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో మెజారిటీ లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే గ్రావెల్‌ను తరలించారు. కానీ బిల్లుల దగ్గరికి వచ్చే సరికి రూ.135 చొప్పున చెల్లించారు. ఇలా రూ.కోట్లు పక్కదారిపట్టి నట్లు తెలుస్తోంది. డ్వామా అధికారుల విచారణ కూడా పూర్తయితే ఆ నివేదిక కూడా ప్రభుత్వానికి చేరనుంది. ఈ నివేదికల ఆధా రంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది.

విధులకు డుమ్మా!

- తొలిరోజే 1,558గాను 899 మందే హాజరు
- 'స్పాట్'కు రాకుండా ఉండేందుకు టీచర్ల యత్నం
- ఎండ తీవ్రత, సెలవులే కారణం
- 'పది' మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 9 వరకు ఈ ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వివిధ జిల్లాలకు చెందిన 1,92,920 సమాధాన పత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య మూల్యాంకనం చేపట్టేందుకు విద్యాశాఖ 1,558 మంది సిబ్బందిని నియమించింది. ఎండ తీవ్రంగా ఉండడం, సెలవులు కావడంతో ఎక్కువమంది ఉపాధ్యాయులు వివిధ కారణాలను చూపుతూ స్పాట్‌కు డుమ్మా కొట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వీరిలో కొంతమందిని అధికారులు రిలీవ్ చేయగా, మరికొంత మంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరు కావాల్సి వచ్చింది.

● కచ్చితంగా హాజరవ్వాలి

విధులకు నియమించిన ప్రతీ ఉపాధ్యాయుడు కచ్చితంగా హాజరు కావాల్సిందేనని అధికా రులు పేర్కొన్నారు. అయితే ఎక్కువ మంది వివిధ కారణాలతో విధులకు హాజరు కాలేమని రాతపూర్వ కంగా అధికారులకు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమందిని రిలీవ్ చేశారు. స్పాట్‌కు హాజరువారిని వెంటనే హాజరయ్యేలా ఆదేశాలు జారీచేయాలని ఎంఈవోలకు అధికారులు సూచించారు. చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్, స్పెషల్ అసిస్టెంట్‌లతోపాటు విద్యాశాఖ సిబ్బంది కూడా ఈ విధులు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నారు. తొలిరోజు మాత్రం ఉపాధ్యాయుల గైర్హాజరు, వివిధ కారణాలతో డుమ్మాయత్నాలతో 899 మంది సిబ్బందితోనే స్పాట్‌ను నిర్వహించారు. రెండోరోజు నుంచి పూర్తిస్థాయిలో సిబ్బంది హాజర య్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

మూల్యాంకనానికి ప్రత్యేకంగా నిధులు

పదోతరగతి పరీక్షల నిర్వహణ సమయంలో కేటాయించిన రీతిలోనే మూల్యాంకన సమయంలో కూడా సిబ్బందికి ప్రత్యేక నిధులు కేటాయించారు. వివిధ విభాగాల్లో రోజువారీ వేతనాలను అందించనున్నారు. వీరిలో క్యాంప్ ఆఫీసర్‌కు రూ.578లు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్స్‌కు రూ.495లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు 429లు, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.396లు, అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు పేపర్‌కు రూ.10లు, స్పెషల్ అసిస్టెంట్‌కు రూ.300లు, క్లరికల్ అసిస్టెంట్‌లకు రూ.132లు, సబార్డినేట్స్‌కు రూ.83లు, చీఫ్ కోడింగ్ ఆఫీసర్స్‌కు రూ.330లు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్‌కు రూ.297లు, అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే విధులకు హాజరయ్యే సిబ్బంది ప్రతి ఒక్కరూ కూడా బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తప్పనిసరిగా వేయాలి.



మూల్యాంకనానికి హాజరైన ఉపాధ్యాయులు

కట్టుదిట్టమైన చర్యలు

మూల్యాంకనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. సిబ్బంది పనితీరు, మూల్యాంకనం చేసే విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈ కెమెరాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌కు అనుసంధానం చేశాం. ఉపాధ్యాయులు విధులు నిర్వహించకపోయినా, గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నా, ఇతర సమస్యలేమన్నా సరే ఈ కెమెరాల ద్వారా గుర్తిస్తాం. విధుల్లో ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌ను అనుమతించం. నిర్దేశించిన సంఖ్య మేరకు మూల్యాంకనం పూర్తికాకపోతే అదనపు సమయమైనా తీసుకుని పని పూర్తి చేస్తాం.

- డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు

ఉదయగిరిలో కురుస్తున్న వర్షం



మెట్టలో ఈదురు గాలులతో వర్షం

- ఉదయగిరిలో నేలకొరిగిన ఫ్లెక్సీలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండధాటికి తట్టుకోలేని ప్రజలు సాయంత్రం సమయంలో వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. వర్షంతోపాటు ఈదురు గాలులు బలంగా వీయడంతో బస్టాండ్ ప్రాంతం, వీధులు దుమ్మధూళితో నిండాయి. గాలుల దెబ్బకు ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు నేలకొరిగి, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి చెట్లకు అరకొరగా ఉన్న కాయలు, పూత సైతం నేల రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఆత్మకూరు
ఉదయగిరి

'ఉపాధి' పనులు కల్పించాలి

అనంతసాగరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని మండల సీపీఎం అధ్యక్షుడు అన్వర్ బాషా డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా అన్ని గ్రామాల్లో పర్యటించగా ఉపాధి హామీ పనులు కల్పించబడేని కూలీలు వాపోయినట్లు తెలిపారు. పనులు లేక జీవనోపాధి దెబ్బతింటుందని, ఇకనైనా అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటుచేసి పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8762
వెండి కిలో ధర	రూ. 1,00,000
వెండి ఒక గ్రాము	రూ.103.00



ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండులో అలంకారప్రాయంగా ఉన్న తాగునీటి కుళాయిలు


సంగం బస్టాండ్‌లో దుకాణాల ముందు ఎండలో నిలబడి ఉన్న ప్రయాణికులు

బస్టాండ్లలో కనీస వసతుల కరువు

- తాగునీటి కోసం ప్రయాణికుల పాట్లు
- మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు బస్టాండ్‌లలో కనీస వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి వసతిలేక కూల్‌డ్రింక్ షాపుల వద్ద తాగునీటిని కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని మండల కేంద్రాల్లో బస్‌షెల్టర్లు, మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రాల్లోని బస్టాండ్‌లలో ప్రయాణికుల వసతులపై ఆంధ్రజ్యోతి గురువారం విజిట్ చేయగా ప్రయాణికుల అవస్థలు వెలుగుచూశాయి. ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న తాగునీటి కొళాయిలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. వాటి ద్వారా నీరు వచ్చినా అవి వేడిగా ఉండడం, వాటర్‌ట్యాంకును శుభ్రం చేసున్నారో, లేదో అన్న అనుమానాలతో ప్రయాణికులు నీటిని తాగలేకపోతున్నారు. ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద చల్లటి మంచినీరు, మధ్యాహ్నం చల్లటి మజ్జిగ అందుబాటులో ఉండడంతో ప్రయాణికులు దాహార్తి తీర్చుకుంటున్నారు. అలాగే మండల కేంద్రమైన సంగం బస్టాండ్‌లో ప్రయాణికులు నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు, ఆత్మకూరు, పామూరు రూట్లల్లో ప్రయాణం చేసే వారితో నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లో షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడుతున్నారు. తాగటానికి నీళ్లలేక, మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో తడుస్తూ బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి సంగం బస్టాండ్‌లో నెలకొంది. అలాగే నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఉన్న మర్రిపాడు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి మండల కేంద్రాల్లో ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్‌షెల్టర్ల నిర్మాణం చేపట్టడంతో పాటు తాగునీటి వసతిని కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- వైద్యాధికారి డాక్టర్ డీ.అశోక్



సంగం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ డి అశోక్ తెలిపారు.

? వడదెబ్బ తగలకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! ఉదయం 11 గంటల లోపు సాయంత్రం 4గంటల తర్వాత పనులు, ప్రయాణాలు చేసుకోవాలి. తప్పని పరిస్థితుల్లో ఎండలో ప్రయాణాలు చేయాల్సి వస్తే గొడుగు వాడాలన్నారు. రోజుకు 5 లీటర్ల వరకు నీటిని తాగితే వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.

? వడదెబ్బ లక్షణాలు ఏమిటీ. వడదెబ్బ తగిలితే ఏమి చర్యలు చేపట్టాలి.

! తల తిరగడం, నీరస పడడం, కళ్లు బైర్లు కమ్మడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే బాధితుడ్ని నీడలో పడుకోబెట్టి చల్లటి నీటితో ముఖం కడిగి గాలి తగిలేటట్లు చేయాలి. అనంతరం ఓఆర్ఎస్, మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటివి తాగించాలి. సమీపంలోని వైద్యశాలలకు తరలించి చికిత్స చేయించాలి.

? వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఎటువంటి చర్యలు చేపడుతోంది.

! స్థానిక వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది ఆశ, ఏఎన్ఎంల ద్వారా ప్రజలకు వడదెబ్బ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో, పంచాయతీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం.

ఈ ఇంటర్వ్యూ

న్యూస్ బాక్స్

దువ్వూరులో ఉచిత కంటి వైద్యశిబిరం


పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సంగం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో నెల్లూరుకు చెందిన స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైనవారికి కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి నెల్లూరు వైద్యశాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల కంటి డాక్టర్ నాగేశ్వరి, సిబ్బంది రాంబాబు, స్థానిక అంజనీ ప్రథమ చికిత్సాలయ నిర్వాహకులు ఎం శ్రీహరి, పీఆర్‌వో వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ క్రిష్టమ్మ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

ఉదయగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగులబావివీధికి చెందిన షేక్ సమన్ అనే విద్యార్థిని విద్యాభివృద్ధికి మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్ షకీలా అనే మహిళా సంరక్షణలో ఉంటోంది. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకునేందుకు తొలివిడతగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతోపాటు విద్యార్థిని కిడ్నీల సమస్యతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి మరింత ఆర్థిక సహాయం అందజేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సోమశిలలో 53.045 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, గురువారం నాటికి 53.045 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 380, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

రేపు వింజమూరు మండల సమావేశం

వింజమూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామ స్వామి ఆలయంలో గురువారం నూతన ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. కదిరి వంశస్తుల దాతృత్వంతో అందజేసిన విగ్రహాలను శాస్త్రోక్తంగా అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం పరిశీలన


తొట్టెల్లో వానపాములు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని మారంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ భార్గవి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా సంపద సృష్టి కేంద్రంలోని కొన్ని తొట్లల్లో వాన పాములను, తొట్లల్లో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడం వలన వానపాములు చనిపోకుండా తేమ ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని సూచించారు. మండల పరిధిలోని పంచాయతీలలో చెత్తసంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు.

సంగమేశ్వరాలయ హుండీల లెక్కింపు


హుండీ నగదు లెక్కిస్తున్న భక్తులు

సంగం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ హుండీలను దేవదాయ శాఖ ఈవో రఘురామయ్య దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. శివాలయంలో రెండు హుండీలు, శ్రీకామాక్షిదేవి ఆలయంలో రెండు హుండీలు లెక్కించగా రూ. 78,473 వచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఈ నగదును స్థానిక కెనరా బ్యాంకులో ఆలయ బ్యాంకు ఖాతాకు జమచేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గిరి, ప్రధానార్చకులు గోపాలకృష్ణమూర్తి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎంఈవోగా అనంతలక్ష్మి నియామకం



ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఎంఈవోగా సీహెచ్ అనంతలక్ష్మిని నియమిస్తూ గుంటూరు ఆర్జేడీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో ఎంఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 582 బేళ్లను తీసుకొని రాగా 14 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 549 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 33 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 235 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

సీతారామపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంధంవారిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గాజులపల్లి సుబ్బమ్మకు గురువారం జరిగిన ఉత్తర క్రియల్లో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ నాయకులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరెడ్డి గురువారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, పానేం రమణయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా సాధనకు ఉద్యమించాలి


విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేసేందుకు రాజకీయాలకతీతంగా నాయకులు, యువత, ఉద్యోగులు, రైతులు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా సాధన సమితి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రజల్లేక నిర్మానుష్యంగా ఉన్నాయన్నారు. ఈప్రాంత ప్రజాప్రతినిధులు ఉదయగిరిని జిల్లా చేయాలని అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించాలన్నారు. కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని 21 మెట్ట మండలాలను ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి : ఈడీ

ఉదయగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ప్రజారవాణా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి సిబ్బందికి, కార్మికులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఉన్న ప్రయాణికులను వదిలి వేయకుండా ఎక్కించుకుని గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఈప్రాంతంలో ప్రయాణికులకు సరిపడా సర్వీసులు ఉన్నాయా లేదా, సిబ్బంది పనితీరు, బస్సు సర్వీసుల మెయింటెనెన్స్ పరిశీలించామన్నారు. ప్రయాణికుల పట్ల గౌరవంగా వ్యవహరించాలన్నారు. డిపోకు ఇటీవల ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులను కేటాయించామన్నారు. ఉదయగిరి నుంచి సీతారామపురం మీదుగా విజయవాడకు, కర్నూల్‌కు కొత్త సర్వీసు నడుపుతున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే సంస్థ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసులరెడ్డి, డీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి ఆలయ భూముల కౌలు వేలం


ఆలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

సంగం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ భూముల కౌలు వేలం పాట దేవాదాయశాఖ అధికారులు గురువారం నిర్వహించారు. సంగమేశ్వరాలయానికి సంగం మండలంలోని సంగం, కొరిమెర్ల, పడమటిపాళెం, పొదలకూరు మండలంలోని సూరాయపాళెం, చేజర్ల మండలంలోని నడిగడ్డ అగ్రహారంలో సుమారు 32.81 ఎకరాల మాగాణి భూములు ఉన్నాయి. ఈభూములకు దేవస్థానం తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో 2025-26 నుండి 2027-28 వరకు మూడేళ్ల పాటు కౌలు వేలం పాట దేవాదాయ శాఖ అధికారి రఘురామయ్య నిర్వహించారు. ఇందులో 7.10 ఎకరాలకు కౌలు వేలంపాటకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో నిలిపివేశారు. మిగిలిన 25.71 ఎకరాలకు రూ. 2,45,700కు కౌలు వేలం పాట దక్కించుకున్నారు. పాట దక్కించుకున్న రైతులకు మూడేళ్ల పాటు సాగు చేసుకునేందుకు హక్కులు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గునుపూడి గిరి, పలువురు కమిటీ సభ్యులు, ప్రధానార్చకులు గోపాలకృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుఖ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సుఖ ప్రసవాలు జరిగేందుకు గర్భిణులు సహకరించాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తెలిపారు. గురువారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సిజేరియన్ వద్దు - సాధారణ ప్రసవాలు ముద్దు అంటూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనల మేరకు పౌష్టికాహారం తీసుకుంటూ తగు వ్యాయామం, విశ్రాంతి తీసుకోవాలని, అప్పుడే సుఖ ప్రసవాలకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరి, డాక్టర్ కిరణ, డాక్టర్ మమత, డాక్టర్ అనూష పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు గ్రామస్థుల మొర


విద్యుత్ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలం నందిపాడు, వెంకటంపేట గ్రామాల్లో గురువారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఎదుట ప్రజలు విద్యుత్ సమస్యలపై ఏకరువు పెట్టారు. లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, గ్రామాల్లో శిథిలమైన స్తంభాలు ఉండడంతో ఈప్రాంతంలో వీస్తున్న గాలులకు నేలకొరిగి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నామని కలెక్టర్ ఎదుట వాపోయారు. స్పందించిన కలెక్టర్ విద్యుత్ శాఖ ఎస్ఈతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజలకు కలెక్టర్ హామీ ఇచ్చారు.

C.R.I.M.E N.E.W.S

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

- ఆత్మకూరులో విషాదం


నిహారిక (ఫైల్)

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): బడికి వెళ్లి చదువుకోవాల్సిన 11 ఏళ్ల బాలిక బల వన్మరణానికి పాల్పడిన విషాద ఘటన ఆత్మకూరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీ సుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని కారి ప్రకాష్, రత్నమ్మ దంపతుల కుమార్తె కాకి నిహారిక (11) ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రోజులాగానే గురువారం స్కూల్‌కు వెళ్లి 12-45 గంటలకు ఇంటికి వచ్చిన నిహారిక బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంతపిలిచినా పలక్కపోవడంతో అనుమానం వచ్చి తలుపును పగులగొట్టి చూడగా బాత్‌రూమ్‌లో ఉన్న కమ్మీకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందింది. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ షేక్ జిలాని సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. 11 ఏళ్లు కూడా నిండని చిన్నారి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడడానికి కారణం ఏమిటా అన్నది అంతుచిక్కడం లేదు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వెలిచర్ల పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలోని పంటకాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. దగదర్తి మండలం ఉలవపాళ్ళ గ్రామానికి సమీపం నుండి వచ్చే పంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకురావడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. వారు సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించారు. మృతుడు 45 నుంచి 50 మధ్య వయస్కుడై ఉంటాడని, కెంపు రంగు చొక్కా, గోధుమ రంగు పంచె, మెడలో పూసలు అల్లిన దండ ధరించి ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాల కోసం విచారణ చేపట్టామని ఎవరైనా గుర్తుపడితే సెల్:9440796327 నెంబరుకు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాతీయ రహదారిపై వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు సమీపంలో బుధవారం అర్ధరాత్రి చెన్నై వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారింది. పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. దుత్తలూరు సెంటర్‌కు చెందిన నాగరత్నమ్మ దుత్తలూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అదుపు తప్పి రెండు కార్లు ఢీ

- తప్పిన ప్రమాదం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు అదుపుతప్పి ఢీకొన్న సంఘటన గురువారం భోగ్యంవారిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు నుంచి వరికుంటపాడు వైపు వెళుతున్న ఓ కారు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. దీంతో కార్ల ముందు భాగం దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు కూడా ఫిర్యాదు అందలేదు.


హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడిని దర్గామిట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఖుద్దూస్‌నగర్‌కు చెందిన ఆసీఫ్ గతనెల 31న స్నేహితులతో కలిసి మాగుంటలేవుట్‌లోని ఓ లాడ్జికి వెళ్లాడు. స్నేహితుల్లో ఒకరైన సాబీర్ మద్యం మత్తులో ఆసీఫ్‌తో గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన సాబీర్ అన్న షఫీవుద్దీన్ కత్తితో ఆసీఫ్ పొట్టలో బలంగా పొడిచాడు. దీనిని సాబీర్ ప్రోత్సహించాడు. బాధితుడు ఆసీఫ్ ఫిర్యాదు మేరకు ఈ నెల 1వ తేదీన దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు గురువారం నిందితుల్లో ఒకరైన షఫీవుద్దీన్‌ను అరెస్ట్ చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బైక్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరులోని టెక్కేమిట్టకు చెందిన చక్రవర్తి వస్త్ర వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన గత నెల 28వ తేదీన పొగతోటకు వెళ్లారు. ఓ వైద్యశాల ముందు తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను పార్క్ చేసి పని నిమిత్తం సమీపంలోని దుకాణానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడు గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత


అక్రమంగా పట్టుబడ్డ రేషన్ బియ్యంతో అధికారులు

కొడవలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో చంద్రశేఖరపురం వద్ద ఉన్న రైస్‌మిల్లులో అధికారులు గురువారం 2,200 బస్తాలు రేషన్ బియ్యంను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీ బాలకోటమ్మ మాట్లాడారు. అక్రమ రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం పట్టుబడ్డ రేషన్ బియ్యంను ఆమె పరిశీలించారు. ఆమె వెంట వీఆర్వో వేణు, తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

గ్రామసభలకు 25 వినతులు

కొండాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూములకు సంబంధించిన నోషనల్ ఖాతాలు కలిగిన రైతుల ఖాతాలను రెగ్యులరైజ్ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గురువారం గ్రామసభలు నిర్వహించారు. నేకునాంపేట సచివాలయంలో జరిగిన గ్రామసభకు 5వినతులు, సాయిపేట సచివాలయంలో జరిగిన గ్రామసభకు 20వినతులు అందినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నేడు గుడవళ్లూరు, పార్లపల్లిలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కోట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ షేక్ ఫిరోజ్ గురువారం చెప్పారు.ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్నాయని, వీటికి సపోర్టుగా మరికొన్ని స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కారణంగా వీఆర్ కోట, తూనుగుంట, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఆయన తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏకే నగర్ సెంటరులోని తపాలా కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని సంఘ విద్రోహశక్తులు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంగం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విగ్రహం పాక్షికంగా దెబ్బతిందని ఈ ఘటన అంబేడ్కర్ వారసుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని వివరించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు.

ఉపాధి పథకం కింద మొక్కలు నాటుదాం


ప్రభుత్వ భూములు పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

కలిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం కింద మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. క్లస్టర్ ఏపీడీగా నూతన బాధ్యతలు స్వీకరించిన మృదులతో కలిసి పెద్దకొండూరు పంచాయతీ పరిధిలోని పెద్దపాడులో గురువారం ప్రభుత్వ భూములు పరిశీలించారు. ఏ ప్రాంతాల్లో మొక్కలు నాటాలో, ఎన్ని మొక్కలు అవసరమవుతాయనే విషయాలను చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొక్కా హజరత్ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనకు కృషి చేయాలి


నియామక పత్రాలు అందజేస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలని తహ సీల్దారు లక్ష్మీనారా యణ అన్నారు. అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళా శాలలో గురువారం చెన్నై, హైదరాబాద్‌లకు చెందిన ఐదు కంపెనీలు 2020 నుంచి 2025 వరకు ఈ కళాశాలలో విద్యనభ్యసించిన డిగ్రీ, పీజీ, బిటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రస్తుతం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహిం చారు. ఎంపికైన విద్యార్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. రామకృష్ణ కళాశాల విద్యార్థులు కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని తమ ప్రతిభను చాటి ఉద్యోగాలు సాధించడం గర్వించతగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన 50మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ హరిప్రసాద్ మాట్లాడారు. 75మంది విద్యార్థులు పాల్గొనగా 50మంది ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ అవకాశం కల్పించేందుకు కృషి చేసిన కరస్పాండెంట్ అల్లంపాటి ఇందిరమ్మ, అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పి.మల్లికార్జున, ఎం.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


ఉలవపాడు సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

జీరో ఖాతా భూములకు పాసుపుస్తకాలు

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో జీరో ఖాతాలో నమోదైన భూములకు సంబంధిత రైతు సరైన ఆధారాలు చూపించి పట్టాదారు పాసుపుస్తకం పొందవచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. గురువారం స్థానిక సచివాలయం-1లో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూమి హక్కుదారుడై ఉండి పట్టాదారు పాసుపుస్తకం లేకుంటే సంబంధిత హక్కు పత్రాలను పరిశీలించి పట్టాదారు పాసుపుస్తకాలు కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉలవపాడు-2 సచివాలయంలో జరిగే గ్రామసభలో అవకాశం ఉన్న రైతులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగలక్ష్మీ, మండల సర్వేయర్ ఖాదర్ హుస్సేన్, వీఆర్వో వీరయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మేత పోరంబోకును మేసేశారు...!

- కొన్నేళ్ల నుంచి యథేచ్ఛగా భూముల ఆక్రమణ
- ఇతరులకు కౌలుకు ఇస్తున్న వైనం
- జోరుగా పంటల సాగు... పట్టించుకోని అధికారులు


వెంగళాపురం మేత పోరంబోకు భూమిలో సాగు చేసిన పొగాకు


ఆక్రమిత భూముల్లో వేసిన బోరు

లింగసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురానికి చెందిన మేత పోరంబోకు భూములు కొన్నేళ్ల నుంచి ఆక్రమణలకు గురయ్యాయి. ఈ ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు చాలా ఏళ్ల నుంచి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు.

ఆక్రమిత భూముల్లో పంటల సాగు

గ్రామ సర్వే నంబర్లు 155/1, 155/2లలో సుమారు 155 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయి.గ్రామంలోని పశువులు, మేకలు, గొర్రెలు ఈ భూముల్లో మేత మేస్తుంటాయి.అయితే ఈ భూములను గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించి, పంటలు సాగు చేయడంతోపాటు బాటలు కూడా ఆక్రమించారు. అయితే గ్రామానికి చెందిన కొందరు ఈ భూములను ఆక్రమించి పొగనారు, పొగాకు, కంది, వరి పైర్లు సాగు చేస్తున్నారు. వీరు 5 నుంచి 10 ఎకరాల వరకు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాక మరికొందరు పొగనారు సాగు చేస్తూ, వాటిని రక్షించుకునేందుకు నీటినిల్వ కోసం పెద్ద పెద్ద గుంతలు తీశారు. అంతేకాక 10 వరకు బోర్లు కూడా వేసుకొని విద్యుత్ కనెక్షన్లు కూడా తీసుకున్నారు.



కబ్జానేకాదు కౌలుకు కూడా...

భూములను కబ్జా చేయడ మేకాదు... ఈ భూములను తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయునిపాలెం, ఎర్రారెడ్డిపాలెం రైతులకు పొగనారు సాగుకు కౌలుకు ఇస్తున్నట్లు చెబుతున్నారు.ఒక్కో ఎకరాకు రూ.5 వేలు కౌలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి భూములను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పొగ నారుకు నీటి కోసం తీసిన పెద్ద గుంత

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్‌కు ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె మస్తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమైనందున పదవ తరగతి ఉత్తీర్ణులై పాలీసెట్ పట్ల ఆసక్తి ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని, కళాశాలలో ఉచిత ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈనెల 30న పాలీసెట్ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు.

104 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 438పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఏడు కంపెనీ ప్రతినిధులు పాల్గొని 334బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-59, ఆర్ఆర్-3, సీఆర్-15, జంపింగ్‌లాట్స్-27 కారణాలతో 104బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.266.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. మేకపాడు ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం పదవ తరగతి పూర్తయిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యు దాస్ ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, ఎంబైపీసీ గ్రూపులు అందుబాటు లో ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫీజు ఓసీ, బీసీలకు రూ. 200, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 మాత్రమేనని ఆయన తెలిపారు.

ఆదరణ కేంద్రానికి మతిస్థిమితం లేని మహిళ



బిట్రగుంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో మతి స్థిమితం లేని మహిళను సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందిని గుర్తించి గురువారం సాయంత్రం ఆదరణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళా పోలీసు జయశ్రీ మాట్లాడారు. గ్రామంలో 35ఏళ్ల ఒంటరి మహిళ తిరుగుతుందని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. ముంగమూరు పంచాయతీలోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సింహాద్రిరావు, భవానీలను సంప్రదించి ఆమెను చేర్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బాలత్రిపురసుందరి, నిర్మల ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుదాం

- జన్మభూమికి చేయూతనిద్దాం
- ఎమ్మెల్యే కాకర్ల సురేష్


ఆంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో కాకర్ల దంపతులు

కలిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జన్మభూమికి సేవ చేయడంతో పాటు గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని ఎరుకులరెడ్డిపాలెంలో షేక్ ఖాజామస్తాన్-నూర్జాహాన్ దంపతులు గ్రామాభివృద్ధికి చేసిన సహాయ సహకారాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి విగ్రహానికి శంకుస్థాపన, షేక్ నూర్జాహాన్ వాటర్‌ప్లాంటు ప్రారంభోత్సవంలో కాకర్ల సురేష్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఎరుకలరెడ్డిపాలెం, గుడ్లదొన ప్రాంతాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. భూముల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు పలువురు మహిళలు తమ బాధలు విన్నవించుకోగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించి భూసమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల విజయలక్ష్మి, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, బాసం నరసింహులునాయుడు, బొట్టా రాధయ్య, కాలపనేని వెంకటరమణయ్య, షరీఫ్, మధు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు పట్టణాభివృద్ధి, సుందరీకరణకు రూ. 26 కోట్లు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ సమగ్ర అభివృద్ధి, సుందరీకరణ కోసం 26 కోట్ల రూపాయలు తక్షణం కేటాయించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి నారాయణ హామీ ఇచ్చారని, ఈమేరకు అత్యవసరంగా ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 15న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరు పట్టణ అభివృద్ధికి రూ. 50 కోట్లు నిధులు మంజూ రుచేస్తున్నట్లు ప్రకటించారని, హామీ నెరవేర్చే క్రమంలో 26 కోట్ల రూపాయలు కేటాయించేందుకు నిర్ణయించారని తెలి పారు. ఈనిధులు పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు వినియోగించనున్నట్లు వివరించారు. అమృత్ 2.0 పథకం కింద కందుకూరు మున్సిపాలిటీ ఎంపికైనందున 49 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడతాయని, ఆ నిధులతో కుంటల సుందరీకరణ, ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పించటం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయనున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

దినేష్‌కు నివాళులు

వలేటివారి పాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని శింగమనేనిపల్లెలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాశం దినేష్ దశదిన ఖర్మకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంట గుర్రం మాల్యాద్రి, సోమినేని రవీంద్ర, ఉప్పుటూరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అనంతరం జనార్ధన కాలనీ పుట్టవద్ద సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వర రావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవి చంద్ర, రావూరి రామ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టు రహదారికి భూములిచ్చిన రైతులను ఆదుకోవాలి

- సీపీఎం డిమాండ్


నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న దళిత రైతులు

గుడ్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణంలో భాగంగా భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం చేవూరు గ్రామసచివాలయ కేంద్రంలో భూములు వివరాలతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేవూరు దళితవాడకు చెందిన 28 మంది చిన్నకారు రైతుల దగ్గర నుంచి గ్రామ సర్వే నెంబర్లు 553లో 13 ఎకరాల 50 సెంట్లు భూమిని పోర్టు అధికారులు తీసుకొని నష్టపరిహారం చెల్లించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సాగు భూమిని కోల్పోయి నిరాశ్రయులైన దళితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు చేవూరి రాజగోపాల్, చేవూరి ఇస్సాక్, లేళ్లపల్లి అంకయ్య, లేళ్లపల్లి కోటేశ్వరరావుతో పాటు గ్రామ సీపీఎం నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాలయంలో పూజలు


భీమవరప్పాడు రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొండాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గురువారం భీమవరప్పాడు తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని సీతారామాలయంలో ఐదు రోజుల పాటు జరిగే తిరునాళ్లలో భాగంగా తొలిరోజు ఉభయకర్తలు అంకురార్పణ కార్యక్రమం సందర్భంగా సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఉభయకర్త మామిళ్లపల్లి మాల్యాద్రి, తిరుపతమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సీతా, రాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. నేడు హనుమంతసేవ, శనివారం గరుడసేవ, ఆదివారం కళ్యాణం, సోమవారం పారు వేటతో తిరునాళ్ల ముగుస్తాయని అర్చకుడు సురేష్‌కుమార్ శర్మ తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాల ప్రారంభం


విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా కోదండరామస్వామి ఆలయం

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకొని అల్లూరు పేటలోని కోదండ రామ స్వామి ఆలయంలో గురువారం ధ్వజా రోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. అర్చక బృందం భార్గవాచా ర్యులు, ఫణిసాగర్ దీక్షితులు, అనంత నారాయణాచార్యులు, సుదర్శనం నాగ గోపాలాచార్యులు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారు పొన్నవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహన సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు అల్లంపాటి వంశస్థుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన


ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

కావలి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో భాగంగా ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు గురువారం డిపో గ్యారేజ్ ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్ఎంయూ గ్యారేజ్ సెక్రటరి కలాం మాట్లాడారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఆర్టీసీ ఎండీకి ఇచ్చిన వినతిపత్రంలోని అంశాలైన 1-2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని నైట్‌ఔట్ అలెవెన్స్ రూ.400 చేయాలని, ఎస్ఆర్‌బీఎస్ పునరుద్ధరించాలన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎన్ఎంయూ రీజినల్ పబ్లిసిటీ సెక్రటరి మీరామొహిద్దీన్, ప్రెసిడెంట్ పీవీ రావు, రవికుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు రీ సర్వే ర్యాలీ, గ్రామసభలు

బిట్రగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ, బిట్రగుంట పంచాయతీలో శుక్రవారం రీ సర్వే ర్యాలీ, గ్రామ సభలు నిర్వహిస్తునట్లు తహసీల్దారు సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల కార్యాలయంలో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10గంటలకు కడనూతల సచివా లయ పరిధిలో అధికారులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తరువాత (పాత) బిట్రగుంట సచివాలయంలో ఉదయం 11గంటలకు ర్యాలీ, రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దారు తెలిపారు. గ్రామాల పరిధిలోని రైతులు రెవెన్యూ, సర్వే అధికారులకు సహకరించాలని కోరారు.

సంగమేశ్వరుడి దర్శనం !

సకల పాపహరణం..

- రేపటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 15 వరకు నిర్వహణ, ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు



దక్షిణ కాశీగా పేరుగాంచిన సంగమేశ్వరాలయం



సంగమేశ్వర ఆలయ శిఖరంపై ఉన్న శివుడు



ఆలయంలో ఉన్న పాతాళ శివలింగం

సంగం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీరాపేరు, బొగ్గేరు, పెన్నానది కలిసేచోట (త్రివేణి సంగమం) పెన్నా ఒడ్డున పరశురాముడు ప్రతిష్ఠించిన ఆలయం సంగమేశ్వరాలయం. దీన్ని దక్షిణ కాశీగా కూడా వ్యవహరిస్తారు. ఇక్కడున్న త్రివేణి సంగమేశ్వరుడిని దర్శించుకుంటే సకల పాపహరణం జరుగుతుందని భక్తుల నమ్మకం. సంగంలోని శ్రీసంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.ఈ ఉత్సవా లలో కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుడు రోజుకొక వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

● 12న రథోత్సవం

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాలతో ప్రారంభ కానున్నాయి. 6న రాత్రి శేషవాహనసేవ, 7న అశ్వవాహనసేవ, 8న సింహవాహనసేవ, 9న వీరభద్రస్వామి హోమం, 10న రావణసేవ, 11న నందిసేవ, 12న ఉదయం రథోత్సవం, రాత్రికి పురుషామృగ వాహనసేవ, 13న గిన్నెభిక్ష, రాత్రికి కల్యాణం, 14న మేష సంక్రమణ, పుణ్యకాల తీర్ధవాది, అలకలతోపు, ధ్వజావరోహణం, 15న గంధ ఒడి ఉత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజూ సాయంత్రం స్వామి, అమ్మవారికి పూలంగిసేవలు, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కూడా ఉంటుంది.



స్వామివారిని దర్శించుకుంటే పాప పరిహారం

బ్రహ్మోత్సవాల్లో సంగమేశ్వరస్వామి వారిని దర్శించుకుంటే పాప విమోచనం కలుగుతుంది. పరశురాముడు ఇక్కడ శివలింగ ప్రతిష్ఠించి పూజలు చేయడంతో పాప పరిహారం జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. దీంతో భక్తులు సంగమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివస్తారు.

- టీ. గోపాలకృష్ణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు

ప్రతిఒక్కరూ సౌర విద్యుత్ వినియోగించాలి

- అభివృద్ధి పనులకు కలెక్టర్ భూమిపూజ



సోలార్‌ప్లాంట్ వినియోగదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మర్రిపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీసీపల్లి, నందవరం, రామనాయుడుపల్లి గ్రామాల్లో గురువారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తొలుత పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఏర్పాటుచేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను ఉపయోగించుకునేందుకు గృహ యజమానులకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద బ్యాంకుల్లో సబ్సిడీ రుణాలు ఇస్తున్నారని, 400 యూనిట్ల పైబడి విద్యుత్ వినియోగించే ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని తప్పక ఉపయోగించుకోవాలని సూచించారు. అందుకు తొలుత జిల్లాలో 639 యూనిట్ల సోలార్ ప్లాంట్‌లు మంజూరు చేశామన్నారు. కాగా, డీసీపల్లిలో ఓ ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న ఇంటి యజమానిని కలెక్టర్ అభినందించారు. అనంతరం ఉపాధిహామీ పథకం ద్వారా పశువులకు నీటి తొట్టెలు నిర్మించేందుకు భూమిపూజ చేశారు. వేసవి దృష్ట్యా పశువులు నీటి కోసం ఇబ్బందులు పడకూడదని ఒక్కో తొట్టికు రూ. 3300 ఖర్చుతో జిల్లాలో 1600 తొట్టెలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టామని, ఈపనులు 15రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం నందవరం ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఇంకుడు గుంతను, రామనాయుడు పల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మాధవిలత, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, తహసీల్దారు అనీల్‌కుమార్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

63 రకాల వైద్య పరీక్షలు చేయాలి

- ల్యాబ్ టెక్నీషియన్లతో డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్లు(ఎల్‌టీ) 63 రకాల వైద్య పరీక్షలు నిర్వ హించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడిం చారు. గురువారం ఆమె కార్యాలయంలో ఎల్‌టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య పరీక్షల ఫలితాలు త్వరగా ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. సమయపాలన పాటించాలని, విధిగా ఎఫ్‌ఆర్ఎస్ నమోదు చేయాలని హెచ్చరించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఫలితాలను నిశ్చయ్ పోర్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లా డుతూ రికార్డులను జిల్లా అంతటా ఒకే విధంగా నిర్వహించాలన్నారు. అనంతరం మాసాంతపు రికార్డులను డీఎం హెచ్‌వోకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి, అదనపు జిల్లా మలేరియా అధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మాసాంతపు రికార్డులను అధికారులకు అందచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు (విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పని చేస్తున్న ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను మెరిట్ ప్రాతిపదికన విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటితోపాటు ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి కోసం సబ్జెక్టుల వారీగా సీనియారిటీ జాబితాను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఉపాధ్యాయులు తెలిపి న అభ్యంతరాల పరిశీలన తరువాతనే తుది జాబితాను విడుదల చేశామన్నారు. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన జాబితాలపై కూడా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వతేదీ వరకు తగిన ధ్రువప్రత్రాలతో విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలన్నారు.

ఆరోగ్యకర పశువులే... రైతుకు లాభం!

- వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం
- త్వరలో పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు
- అందుకు పశుబీమా తప్పనిసరి
- 'ఆంధ్రజ్యోతి'తో పశుసంవర్థకశాఖ జేడీ రమేష్‌నాయక్

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత నిస్తోంది. పశువుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే గోకులాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే పశుగ్రాస క్షేత్రాలు, బీమా పథకాలను అందిస్తోంది. అంతేకాక వేసవిలో పశువుల ఆరోగ్య రక్షణకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి చేపడుతున్న కార్యాచరణను ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



?: వేసవిలో పాల ఉత్పత్తి తగ్గడంతోపాటు పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. వీటిని అధిగమించాలంటే...

!: అధిక ఉష్ణోగ్రతల వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుంది. కాబట్టి పశువులను ఎండలో ఎక్కువ సమయం లేకుండా చూసుకోవాలి. ఉదయం 10 లోపు సాయంత్రం 5గంటల తరువాత మాత్రమే మేతకు బయటకు వదలాలి.

?: వేసవిలో ఎలాంటి మేత అందించాలి.

!: వేసవిలో అధిక వేడి వల్ల పశువులు తీవ్ర ఒత్తిడికి గురవు తాయి. ముఖ్యంగా తగినంత నీరు అందించాలి. ఖనిజ లవణాల మిశ్రమాన్ని 30 నుంచి 50గ్రాములు దాణాతో కలిపి ఇవ్వాలి. గడ్డిని ముక్కలుగా కోసి వేయవడం వల్ల త్వరగా జీర్ణించుకుంటాయి.

?: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటిని అందించే కార్యక్రమాలు చేపట్టారా...

!: పశువులకు నీటిని అందించేందుకు నీటి తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు 963 నీటి తొట్టెలు అవసరమని నివేదికలు పంపాం. ఉపాధిహామీ ద్వారా వీటిని ఏర్పాటు చేస్తాం.

?: పచ్చిగడ్డి అందించేందుకు తీసుకుంటున్న చర్యలు

!: పశువులకు పచ్చగడ్డి అందించేందుకు ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో 1200 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటికే 603 ఎకరాల్లో గ్రాసం పెంచేందుకు దరఖాస్తులు వచ్చాయి. 100శాతం రాయితీపై ప్రభుత్వం గ్రాసం పెంపకానికి ప్రోత్సహిస్తోంది.

?: మినీ గోకులాల పరిస్థితి ఏమిటీ

!: జిల్లాలో 1300 మినీ గోకులాలు ఏర్పాటు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1160 ప్రారంభమయ్యాయి.

?: పాడిరైతులకు రుణాలు అందిస్తారా..

!: పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడిరైతులకు రుణాలు అందించేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అతి త్వరలోనే అర్హులైన అందరికి రుణాలు అందిస్తాం. పాడి రైతులు పశుబీమా పథకంలో చేరాలి. ప్రతి రైతు బీమా చేయించుకోవాలి.

రైతులంతా సహకరిస్తేనే రీసర్వే విజయవంతం: కలెక్టర్

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులంతా సహకరిస్తేనే రీసర్వే విజయవంతంగా ముందుకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నందిపాడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో సక్ష్యం పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంత, పెరటితోట, చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్త భోగ్యం సరస్వతి సెల్‌ఫోన్ తీసుకుని యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వెంకటంపేట సచివాలయంలో రీసర్వేపై రైతులతో గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. గ్రామానికి సమీపంలో ఉపాధి హామీ పథకం కింద నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే దుత్తలూరులో పీఎం సూర్యఘర్ పథకం కింద వినియోగదారుడు ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీపీఎస్ విధానంలో రీసర్వే చేస్తుండడంతో ఎలాంటి తప్పిదాలు ఉండవని, రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో మల్లికార్జున, సీడీపీవో సునీత, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు మణికుమార్, రామకృష్ణరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియ వేగవంతం చేయాలి

దుత్తలూరులోని సీడ్స్ స్వచ్ఛంద సంస్థ క్యాంపస్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ అమలు చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ సాగు, విద్యా, నైపుణ్య శిక్షణ తరగతులు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, వ్యవసాయాధికారులతో సమీక్షించారు. రైతులకు కేటాయించే విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

మనుబోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రఘురామరాజు అన్నారు. మండలంలోని మడమనూరులో రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు రీసర్వే జరిగే సమయంలో ఏ పొలం వద్ద జరుగుతుందో ఆ రైతు దగ్గరుండి పత్రాలు సరిచూసుకుని సిబ్బందికి సహకరించాలన్నారు. అలా చేస్తే రీసర్వేలో తప్పులు ఉండవన్నారు. ఏ పొలంలో సర్వే జరుగుతుందో ఆ పొలం రైతులు తప్ప మిగతా రైతులు వెళ్లకూడదన్నారు. రీసర్వే తరువాత రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు, కొత్త ఖాతానెంబర్లు వస్తాయన్నారు. కావున రీసర్వే అయ్యేంతవరకు రైతులు రీసర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, రీసర్వే డీటీ మంజుల, సర్వేయర్ శ్రీనువాసులు, వీఆర్‌వోలు, టీడీపీ నాయకులు నూనె లక్ష్మయ్య, ఉడతా విజయ్‌కుమార్, చెమర్తి సుధీర్ పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల గ్రేడింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి

- బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్



కందుకూరులో పొగాకువేలంను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు గ్రేడింగ్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు వేలంకు తీసుకొచ్చే ముందు బేళ్లను పరిశీలించుకుని నాణ్యతగా తేవటం ద్వారా గిట్టుబాటు ధరలు పొందాలని పొగాకుబోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ సూచించారు. కందుకూరు 2 పొగాకు వేలంకేంద్రంలో గురువారం ఆయన వేలంతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ రైతులకు ఈఏడాది పెట్టుబడి విపరీతంగా పెరిగినందున గిట్టుబాటు ధరలు ఇవ్వటం ద్వారా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. ఆయన వెంట పొగాకుబోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య, రైతు నాయకులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ ద్వారా ఎన్నో సేవలు

- సంస్థ అంతర్జాతీయ కమిషనర్లు ఎడ్వర్డ్ హెల్, షెల్లీ హిల్



ఎడ్వర్డ్ హెల్, షెల్లీహిల్‌కు స్వాగతం పలుకుతున్న బాలసుధాకర్ తదితరులు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సాల్వేషన్ ఆర్మీ ద్వారా ఎన్నో రకాల సేవలు అందిస్తున్నామని ఆ సంస్థ అంతర్జాతీయ కమిషనర్లు ఎడ్వర్డ్ హెల్, షెల్లీ హిల్ వెల్లడించారు. నెల్లూరులోని సాల్వేషన్ ఆర్మీ చర్చి పరిశీలనకు గురువారం వారు వచ్చారు. చర్చి ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు చర్చి బాగా పనిచేస్తోందని అభినందించారు. కాగా, ఇంటర్నేషనల్ కమిషనర్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బాలసుధాకర్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రూథర్ శామ్యూల్, విజయకుమార్, విజయప్రసాద్, మేరి గ్రేసి, చంద్ర రాజు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రావెల్ స్టోన్ దోపిడీ ముఠాపై

కేసు నమోదు చేయాలి : ఆర్‌జేసీ

- 'నీలకంతేశ్వర మాన్యంలో మళ్లీ దొంగలు' కథనంపై స్పందన
- మాన్యం భూములు పరిశీలించిన ఆర్‌జేసీ



నీలకంతేశ్వరుడి మాన్యం భూములను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 1వ తేదీన ప్రచురితమైన 'నీలకంతేశ్వర మాన్యంలో మళ్లీ దొంగలు' శీర్షిక కథనంపై ఎండోమెంట్‌కు చెందిన రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) ఆజాద్ చంద్రశేఖర్ స్పందించారు. గురువారం ఆయన ఆలయ భూములను పరిశీలించారు. మాన్యంలో సేకరించి కుప్పలుగా పోసిన గ్రావెల్‌ను తరలించకుండా చూడాలని వేణుగోపాల స్వామి ఆలయాల గ్రూపు కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులును ఆదేశించారు. 30.05 ఎకరాలకు సంబంధించి ఈనెల 11వ తేదీన స్థానిక దేవస్థానంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్‌జేసి పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఆలయ భూమలకు పక్కనే భువనేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ పేరుతో గ్రావెల్ మైనింగ్ చేస్తూ పనిలోపనిగా ఆలయ భూముల్లో విలువైన సంపద కొల్లగొట్టిన ఫణికుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్‌జేసి ఆదేశించడంతో ఈవో శ్రీనివాసులు గురువారం సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక పిర్యాదు అందచేశారు. దేవస్థానానికి చెందాల్సిన సొమ్మును దొపిడీ ముఠా నుంచి రాబట్టేవరకు చట్టపరంగా ముందుకు వెళతామని ఆర్‌జేసి ఈ సందర్భంగా తెలిపారు.

డంప్ చేసిన గ్రావెల్ సీజ్

ఆలయ భూముల్లో కొల్లగొట్టిన గ్రావెల్ స్టోన్ ఉలవపాడులోని జాతీయ రహదారిపక్కన లారీ అసోసియేషన్ వెనుక డంప్ చేసి ఉంది. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈవో శ్రీనివాసులు ఎస్సై అంకమ్మతో కలిసి పరిశీలించి సీజ్ చేశారు.

ఎక్సైజ్ విశ్రాంత ఉద్యోగికి ఆర్థిక సాయం



చెక్కును అందిస్తున్న ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఎస్ఐగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కే సాయికృష్ణ కుమారుడి కిడ్నీ మార్పిడి చికిత్సకు ఆ శాఖ అధికారులు ఆర్థిక సాయం చేశారు. వారందరూ కలిసి సమకూర్చిన రూ.3,67,616కు చెక్కును గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్లు జే రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ ప్రభాకర్ రావు, జిల్లా అధ్యక్షుడు జీవీ ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రాల పరిశీలన



చెత్త సేకరణ కేంద్రం తొట్టెల్లో నిల్వచేసిన చెత్తను పరిశీలిస్తున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మేజర్ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న చెత్త సేకరణ కేంద్రాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఎల్ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఉలవపాడు ప్రధాన రహదారిపై కూరగాయలు, పండ్ల మార్కెటు యజమానులను రోజువారి చెత్త సేకరణ విధానంపై ఆరాతీశారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి దేవస్థానం బజారులోని ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇళ్ల పన్నుల విషయంలో జాప్యం చేయొద్దని, అదేవిధంగా వేసవికాలం నీటి ఎద్దడి లేకుండా అప్రమత్తంగా ఉండాలని, చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణలో అశ్రద్ధ చేయవద్దని ఎంపీడీవో విజయ, ఈవోఆర్డీ శ్రీనివాసులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ఇద్దరు వార్డెన్లకు చార్జ్ మెమోలు

నెల్లూరు (హరనాథ పురం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వార్డెన్లు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో వారికి కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకట లక్ష్మమ్మ గురువారం చార్జ్ మెమోలు అందజేశారు. విడవలూరు, మైపాడు బీసీ బాలుర వసతి గృహాల్లో వార్డెన్లుగా విధులు నిర్వహిస్తున్న ఇరువురు పలు అక్రమాలకు పాల్పడ్డారని 2023లో ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై జిల్లా కలెక్టర్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని విచారణకు ఆదేశించారు. ఆ విచారణ నివేదిక ఆధారంగా సదరు వార్డెన్లకు చార్జ్ మెమోలు అందజేశారు.

కండలేరు నీటి మట్టం 48.24 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తిస్థాయి నీటి మ ట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మ ట్టం 48.24 ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలి పారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో 1,390 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1,340 క్యూసె క్కు లు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో అవుతోందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8765
వెండి కిలో ధర	రూ. 1,02,600
వెండి ఒక గ్రాము	రూ.105.60

పల్లెల్లో జోరుగా క్రికెట్ బెట్టింగ్

- చోద్యం చూస్తున్న అధికారులు
- చేతులు మారుతున్న రూ.లక్షలు



కొడవలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఐపీ ఎల్ పలానా టీం గెలిస్తే రూ.వెయ్యికి రూ.10వే లు, సిక్స్ కొడితే పెట్టిన బెట్టింగ్ డబుల్, 20ఓ వర్లకు 120లోపే కట్టడి చేస్తే మూడింతలు. బా ల్ బాల్‌కు పందెం ఇది ఐపీఎల్ నేపథ్యంలో ప ల్లెల్లో బెట్టింగ్ జోరుగా నడుస్తోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం లక్షలు చేతులు మారుతున్నాయి. తక్కువ సమ యంలో ఎక్కువ డబ్బులు ఆశతో యువత చి త్తవుతున్నారు. కొంత మంది ఆస్తులు తాకట్టు పెట్టి బెట్టింగ్ కాస్తున్నారు. గత నెల 22వతేదీ ఐపీఎల్ స్టార్ట్ అయింది. దీంతో ఇన్ని రోజులు బెట్టింగ్ లేక ఖాళీగా ఉన్న పందెంరాయుళ్లు ప నిదొరికినట్లు ఇందులో బుకీలు సైతం వీరిని పనిలో దింపి కమీషన్లు రాబట్టుకుంటున్నాడు. ఈ దుస్థితి కొడవలూరు మండలంలో చోటు చేసుకుంది. రాజుపాలెం, రామన్నపాలెం, కొడవలూరు, తలమంచిలో జోరుగా సాగుతు న్నాయి. ముఖ్యంగా రాజుపాలెం కేంద్రం దూరంగా కొందరు బుకీలు యువతకు వల వేసి బెట్టింగ్ మాఫియాలోకి దింపుతున్నాడు. ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు చేతులు మారుతున్నా యి. బెట్టింగ్ వివిధ మార్గాల్లో నడుస్తున్నాయి. పైన చెప్పిన గ్రామాల్లో గ్రూపులుగా ఏర్పడి పందెం కాస్తున్నారు. మరికొందరు వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసుకుని ఆడుతున్నారు.

- బాల్ టూ బాల్ ..

ఒక ప్లేయర్ బాల్‌కు ఎన్ని పరుగులు కొడతాడు. ఓవర్లో ఎన్ని పరుగులు, సిక్స్ కొడతాడా, ఫోర్ కొడతాడా అంటూ జూదమాడుతున్నారు. కేవలం మ్యాచ్ విజేతలు కాకుండా టాస్ ఎవరు గెలుస్తారు, బాల్ టూ బాల్ బెట్టింగ్ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నా రు. ఇకనైనా బెట్టింగ్‌ను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెంచలకోనలో శ్రీరామనవమికి ప్రత్యేక పూజలు



బుచ్చి పెద్దూరులో కోదండరాముడి ఆలయం

రాపూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 6వ తేదీన పెంచలకోనలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం అభిషేకంతో పాటు, సీతారామ లక్ష్మణులకు స్నపన తిరుమంజనం, అనంతరం కల్యాణోత్సవం, సాయంత్రం హనుమంత ఆస్థానం వైభవంగా జరుగుతాయని, భక్తుల సౌకర్యార్థం వేస వి దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆలయ ఈవో తెలిపారు.

5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో శ్రీ కోదండ రాముడి బ్రహ్మోత్సవాలు 5 నుంచి 15వ తేదీ వరకు వేడుకగా జరగనున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్ది, విద్యుద్దీపాలతో అ లంకరించారు. 5వ తేదీ రాత్రి అంకుర్పాణతో ఉ త్సవాలు ప్రారంభం కానుండగా, 6న ధ్వజా రో హణం, రాత్రి శేషవాహనసేవ, 7న హంస వా హనం, 8న యాళివాహన సేవ, 9న హను మంతసేవ, 10న గరుడసేవ, 11న రాత్రి శ్రీవారి కల్యాణం జరగనుంది. 12న ఉదయం రథోత్స వం, రాత్రి తెప్పోత్సవం, 13న అశ్వవాహన సేవ, 14న అలకలతోఫు, చక్రస్నానం, ధ్వజావరో హ ణం, 15వ తేదీ రాత్రి ఏకాంతసేవతో ఉత్సవా లు ముగియనున్నాయి. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవ స్థాపక ధర్మకర్త దొడ్ల మురళీ కృష్ణారెడ్డి తెలి పా రు. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుం డా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ సుప్రజ మురళి తెలిపారు. పారిశుధ్యం మెరుగుతోపాటు వైద్య శిబిరాలు, చలివేంద్రాలు, పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



నరుకూరు సెంటర్‌లో తుప్పు పట్టిపోయిన విద్యుత్ స్తంభం

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరు కూరు సెంటర్‌లోని విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అ ని సమీపం గృహాల యజమానులు, చిరు వ్యాపారులు బిక్కుబిక్కు మం టూ జీవనం సాగిస్తున్నారు. ఈ విష యాన్ని పలుమార్లు విద్యుత్ అధికా రులకు విన్నవించుకున్నా పట్టించు కున్న పాపానపోలేదని వాపోతున్నా రు. విద్యుత్ స్తంభానికి కూతవేటు దూరంలో సబ్ స్టేషన్ ఉన్నా సి బ్బంది దీనివైపు కన్నెత్తి చూడటం లే దంటున్నారు. ఉన్నతాధికారులు స్పం దించి ఆ విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయాలని చిరు వ్యాపారులు, గృహ యజమానులు కోరుతున్నారు.

ఉదయగిరి జిల్లా సాధనకు ఉద్యమించాలి



విలేకరులతో డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేసేందుకు రాజకీయాలకతీతంగా నాయకులు, యువత, ఉద్యోగులు, రైతులు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణు గోపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా సాధన సమితి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లా డుతూ ఈ ప్రాంతం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రజల్లేక నిర్మానుష్యంగా ఉన్నాయన్నారు. ఈప్రాంత ప్రజాప్రతినిధులు ఉదయగిరిని జిల్లా చేయాలని అసెంబ్లీలో తమ గళాన్ని వినిపిం చాలన్నారు. కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లా లోని 21 మెట్ట మండలాలను ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, ఖాదర్‌బాషా తది తరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమాభివృద్ధికి కృషి

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- గిరిజన మత్స్యకారులకు సైకిళ్లు, వలల పంపిణీ



గిరిజన మత్స్యకారులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గిరిజ ను ల సంక్షేమాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్యకారులకు సైకిళ్లు, వలలు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్ల లకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసిన గిరిజన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజ నుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, టీ డీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి సంక్షేమ ఫ లాల పంపిణీకి పునర్ వైభవం ప్రారంభం అయినట్లు చెప్పారు. త్వరలో బీసీ రెసిడెన్షియల్ స్కూ లు కోసం స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు భవన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వెంకటాచలంలో బీసీ కార్పొ రేషన్ ద్వా రా మహిళల కోసం ఏర్పాటు చేసిన కు ట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు. .

బాట కోసం స్థలం ఇవ్వాలని బెదిరిస్తున్నారు! :రైతు ఆవేదన

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తన పొలంలో బాట ఇవ్వకపో తే అంతు చూస్తానంటూ నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి గుండాలను తీసుకొచ్చి దౌర్జన్యం చేస్తున్నాడంటూ జొన్నవాడకు చెందిన రైతు కందికట్టు మధు ఆ వేదన వ్యక్తం చేశారు. గురువారం జొన్నవాడలో బాధితుడితోపాటు చు ట్టుపక్కల రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వే నెం. 90-4లో సుమారు 32.20 ఎకరాల (రెడ్డిగారి బీడు) భూమిని 45 ఏళ్ళ క్రితం పె నుబల్లిలోని ఓ భూస్వామి వద్ద జొన్నవాడకు చెందిన సుమారు 50 కుటుం బాలు కొనుగోలుచేసి సాగు చేసుకుంటున్నాయి. సర్పంచు కందికట్టు పెం చలయ్య మూడేళ్ల క్రితం తన భూమిని సమీప బంధువుకు విక్రయించగా ఆ భూమిని వారి అల్లుడు ఆర్నెళ్ల క్రితం కొనుగోలు చేసి చేపల గుంతలు ఏ ర్పాటు చేశారు. ఆ గుంతల్లోకి వేస్టేజీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా దారి ఏ ర్పాటు కోసం తన 40 సెంట్ల భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని మధు ఆవేదన చెందారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచు పెంచలయ్య, టీడీపీ నాయకులు, సు ధాకర్, రత్నం, సుబ్బారావు, శీనయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

మేత పోరంబోకును మేసేశారు..!



వెంగళాపురం మేత పోరంబోకు భూమిలో సాగు చేసిన పొగాకు

లింగసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురానికి చెందిన మేత పోరంబోకు భూములు కొన్నేళ్ల నుంచి ఆక్రమణలకు గురయ్యాయి. ఈ ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు చాలా ఏళ్ల నుంచి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు.

- ఆక్రమిత భూముల్లో పంటల సాగు

గ్రామ సర్వే నంబర్లు 155/1, 155/2లలో సుమారు 155 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయి.గ్రామంలోని పశువులు, మేకలు, గొర్రెలు ఈ భూముల్లో మేత మేస్తుంటాయి.అయితే ఈ భూములను గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించి, పంటలు సాగు చేయడంతోపాటు బాటలు కూడా ఆక్రమిం చారు. అయితే గ్రామా నికి చెందిన కొందరు ఈ భూములను ఆక్రమించి పొగనారు, పొగాకు, కంది, వరి పైర్లు సాగు చేస్తున్నారు. వీరు 5 నుంచి 10 ఎకరాల వరకు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాక మరికొందరు పొగనారు సాగు చేస్తూ, వాటిని రక్షించుకునేందుకు నీటినిల్వ కోసం పెద్ద పెద్ద గుంతలు తీశారు. అంతేకాక 10 వరకు బోర్లు కూడా వేసుకొని విద్యుత్ కనెక్షన్లు కూడా తీసుకున్నారు. భూములను కబ్జా చేయడ మేకాదు... ఈ భూములను తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయు నిపాలెం, ఎర్రారెడ్డిపాలెం రైతులకు పొగనారు సాగుకు కౌలుకు ఇస్తున్నట్టు చెబుతున్నారు.ఒక్కో ఎకరాకు రూ.5 వేలు కౌలు తీసుకుంటున్నట్టు చెప్పారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణ దారుల నుంచి భూములను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రాభివృద్ధికి ఊతం

- రాయితీలపై హోటల్స్ అసోసియేషన్ హర్షం
- మరో 17 స్టార్ హోటల్స్ వస్తాయని వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వి. స్వామి, చిత్రంలో రాజయ్య, గోకరాజు గంగరాజు

గుణదల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోటల్ రంగానికి రాయితీలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి తెలిపారు. విజయవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏటా రూ.66లక్షలు ఎక్సైజ్ సుంకం చెల్లిస్తున్నామని దానికి తగ్గట్లుగా హోటల్ వ్యాపారాలు ఉండకపోవడంతో నష్టం వస్తోందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన గురువారం అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో.. స్టార్ హోటల్స్ చెల్లిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని రూ.66 లక్షల నుంచి రూ.25 లక్షలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. హోటల్ రంగానికి మరిన్ని రాయితీలు ఇస్తుండటంతో ఏపీలో స్టార్ హోటల్స్ ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రస్తుం రాష్ట్రంలో 54 స్టార్ హోటల్స్ ఉన్నాయని, ప్రభుత్వ ప్రోత్సాహంతో మరిన్ని స్టార్ హోటల్స్ నిర్మాణానికి ముందుకు వస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఏపీలో 50 వేల రూమ్‌ల నిర్మాణం జరగాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి పర్యాటక శాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గేట్‌వే హోటల్ అధినేత రాజయ్య మాట్లాడుతూ..ఏపీలో టూరిజం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా ఐటీ కంపెనీలు పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. తద్వారా టూరిజం అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని చెప్పారు. ఏపీలో ఉన్న సముద్ర తీరం వెంబడి రిసార్ట్స్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని, ఐటీ రంగం కూడా అదే తరహాలో ఏర్పాటు జరిగేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెడితే ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం ఖాయమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై యువత దృష్టి పెట్టాలని గ్రీన్ హోటల్ అధినేత గోకరాజు గంగరాజు అన్నారు. చంద్రబాబు టూరిజంపై రాయితీలు ప్రకటించిన నేపథ్యంలో అమరావతిలో 17స్టార్ హోటల్స్ రానున్నాయని తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల వరకు హోటల్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరడంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు సానుకూలంగా స్పందించి అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ తరహాలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే తాము ఏపీ అభివృద్ధికి మరింతగా చేయూత ఇవ్వగలమని వెల్లడించారు.

న్యూస్ బాక్స్

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):శాంతి భద్రతల పరిరక్షణకు మండలంలోని కుడితిపాలెంలో గురువారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు అమ్మచారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు దొడ్ల మల్లికార్జున రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, స్థానిక తెలుగుదేశం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి అడ్మిషన్ల ప్రారంభం

పొదలకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీతో పాటు వృత్తి విద్య కోర్సు, ఓఏ అనే నాలుగు గ్రూపులున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వారు అందజేసే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందజేస్తారని పేర్కొన్నారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం కూడా అమలులో ఉందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థిని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు పొదలకూరు రానున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే

పొదలకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద ఉన్న ఇళ్ల నిర్మాణాలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలిస్తారని మండల టీడీపీ అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు తెలిపారు.టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

● తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరిగొండ ఎస్టీ కాలనీలో గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా నిర్మించిన జగనన్న గృహాలపై గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మరియు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం 9గంటలకు పరిశీలనకు వస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

చెన్ను బాలకృష్ణారెడ్డికి ఘన నివాళి



చెన్ను వర్ధంతి కార్యక్రమంలో మెట్టుకూరి ధనుంజయ రెడ్డి తదితరులు

రాపూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల సీనియర్ నాయకుడు, మాజీ మార్కెటింగ్ చైర్మన్ చెన్ను బాలకృ ష్ణారెడ్డి వర్ధంతి పోకూరుపల్లి సమీపంలోని చెన్ను గార్డెన్స్‌లో గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా డిసిసిబి బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి, పెంచలకోన మాజీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, చెన్ను భాస్కర్‌రెడ్డి, చెన్ను పెంచలరెడ్డి, చెన్ను అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెసర పైరు పరిశీలన

కోవూరు, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): గంగవరంలో సాగుచేస్తున్న పెసర పంటను గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఇందిరావతి మాట్లాడారు. పెసరపంటలో లద్దెపురుగు నివారణకు 5కిలోల తౌడులో అరకిలో బెల్లం పులియబెట్టి సాయంత్ర సమయంలో పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణకు 0.2గ్రాముల ఎసిటామిప్రిడ్ ద్రావణాన్ని లీటరు నీటితో కలిపి చల్లాలన్నారు. పోషకలోపం తలెత్తకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెసరపంటను ఆత్మ ప్రాజెక్టు డైరక్టరు శివన్నారాయణ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఓబయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి సూచనలిచ్చారు.

జీరో ఖాతా భూములకు పాసుపుస్తకాలు

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో జీరో ఖాతాలో నమోదైన భూములకు సంబంధిత రైతు సరైన ఆధారా లు చూపించి పట్టాదారు పాసుపుస్తకం పొం దవచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. గురువారం స్థానిక సచివాల యం-1లో గ్రామసభ నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూమి హక్కుదారుడై ఉండి పట్టాదారు పాసుపుస్తకం లేకుంటే సంబంధిత హక్కు పత్రాలను పరిశీలించి పట్టాదారు పాసుపుస్త కాలు కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

- ఆత్మకూరులో విషాదం



నిహారిక (ఫైల్)

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): బడికి వెళ్లి చదువుకోవాల్సిన 11 ఏళ్ల బాలిక బల వన్మరణానికి పాల్ప డిన విషాద ఘటన ఆత్మకూరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీ సుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని కారి ప్రకాష్, రత్నమ్మ దంపతుల కుమార్తె కాకి నిహారిక (11) ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రోజులాగానే గురువారం స్కూల్‌కు వెళ్లి 12-45 గంటలకు ఇంటికి వచ్చిన నిహారిక బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంతపిలిచినా పలక్కపోవడంతో అనుమానం వచ్చి తలుపును పగులగొట్టి చూడగా బాత్‌రూమ్‌లో ఉన్న కమ్మికు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందింది. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ షేక్ జిలాని సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. 11 ఏళ్ల కూడా నిండని చిన్నారి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడడానికి కారణం ఏమిటా అన్నది అంతుచిక్కడం లేదు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వెలిచర్ల పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీ సమీపంలోని పంటకాలువలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. దగదర్తి మండలం ఉలవపాళ్ల గ్రామానికి సమీపం నుండి వచ్చే పంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకురావడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని పోలీసుల కు తెలిపారు. వారు సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించారు. మృతుడు 45 నుంచి 50 మధ్య వయస్కుడై ఉంటాడని, కెంపు రంగు చొక్కా, గోధుమ రంగు పంచె, మెడలో పూసలు అల్లిన దండ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వివరాల కోసం విచారణ చేపట్టామని ఎవరైనా గుర్తుపడితే సెల్:9440796327 నెంబరుకు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాతీయ రహదారిపై వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు సమీపంలో బుధవారం అర్ధరాత్రి చెన్నై వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారింది. పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా ఉన్నాయి. దుత్తలూరు సెంటర్‌కు చెందిన నాగరత్నమ్మ దుత్తలూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అదుపు తప్పి రెండు కార్లు ఢీ

- తప్పిన ప్రమాదం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు అదుపుతప్పి ఢీకొన్న సంఘటన గురువారం భోగ్యంవారిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు నుంచి వరికుంటపాడు వైపు వెళుతున్న ఓ కారు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. దీంతో కార్ల ముందు భాగం దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు కూడా ఫిర్యాదు అందలేదు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడిని దర్గామిట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఖుద్దూస్‌నగర్‌కు చెందిన ఆసీఫ్ గతనెల 31న స్నేహితులతో కలిసి మాగుంటలేవుట్‌లోని ఓ లాడ్జికి వెళ్లాడు. స్నేహితుల్లో ఒకరైన సాబీర్ మద్యం మత్తులో ఆసీఫ్‌తో గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన సాబీర్ అన్న షఫీవుద్దీన్ కత్తితో ఆసీఫ్ పొట్టలో బలంగా పొడిచాడు. దీనిని సాబీర్ ప్రోత్సహించాడు. బాధితుడు ఆసీఫ్ ఫిర్యాదు మేరకు ఈ నెల 1వ తేదీన దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్‌బాబు గురువారం నిందితుల్లో ఒకరైన షఫీవుద్దీన్‌ను అరెస్ట్ చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బైక్ చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరులోని టెక్కేమిట్టకు చెందిన చక్రవర్తి వస్త్ర వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన గత నెల 28వ తేదీన పొగతోటకు వెళ్లారు. ఓ వైద్యశాల ముందు తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను పార్క్ చేసి పని నిమిత్తం సమీపంలోని దుకాణానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడు గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా పట్టుబడ్డ రేషన్ బియ్యంతో అధికారులు

కొడవలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో చంద్రశేఖరపురం వద్ద ఉన్న రైస్‌మిల్లులో అధికారులు గురువారం 2,200 బస్తాలు రేషన్ బియ్యంను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీ బాలకోటమ్మ మాట్లాడారు. అక్రమ రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం పట్టుబడ్డ రేషన్ బియ్యంను ఆమె పరిశీలించారు. ఆమె వెంట వీఆర్‌వో వేణు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	246

కోడిగుడ్ల ధర (100): 440

శ్రీకృష్ణలీలల్లో భక్తి, రక్తి, ముక్తి

● ప్రవచనకర్త కోట రాజశేఖర్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం కోట రాజశేఖర్ తన ఆధ్యాత్మిక ప్రవచనంలో శ్రీకృష్ణలీలలను వర్ణించారు. భక్తి, రక్తి, ముక్తిని శ్రీకృష్ణుడు తన లీలల ద్వారా తెలియజేశారన్నారు. ఆలయ అర్చకుడు మల్లవరపు లక్ష్మీ నరసింహారావు అష్టాదశ గీతా శ్లోకాలను రాగ భావయుక్తంగా గానం చేశారు. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లకు అర్చన, గురుగ్రహ హోమం జరిగాయి. ఉభయకర్తలుగా గండవరపు చంద్రశేఖర్ కుటుంబం వ్యవహరించింది. సాదా నాగేంద్ర, కంచి జ్ఞానేంద్ర, చక్రాల ఆనందకుమార్ స్వామి, సమయానందనాథ, రామసుబ్రహ్మణ్యం శర్మ, వేలూరు నారాయణ స్వామి, రమణమూర్తి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణులు









వీళ్ల కోసమే వంతెన కట్టినట్లుంది!

● తెగ వాడేస్తున్నారు!

నగరంలోని రామలింగాపురం జంక్షన్‌లో ఉన్న ఫ్లైవోవర్ బ్రిడ్జి కింది స్థలాన్ని స్థానిక వ్యాపారులు ఎంచక్కా వాడేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న మినీ లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారులు వారి లారీలను వంతెన కింద నిలుపుకుని దానిని పార్కింగ్ ప్రాంతంగా మార్చేశారు. ఒకటి, రెండు కాదు పదుల సంఖ్యలో వాహనాలను ఇక్కడ నిలుపుతున్నారు. ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో మధ్యాహ్నం పూట పనుల మీద నగరంలోకి వచ్చిన వారు కాసేపు నీడన నిలబడటానికి ఈ వంతెన బాగా ఉపయోగపడుతుంది. పాలకులు, అధికారులు స్పందించి వంతెన కింది స్థలాల్లో పూలమొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది పాదచారులు సేదతీరడానికి ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి

● చిరు వ్యాపారులకు నగర కమిషనర్ సూర్యతేజ ఆదేశం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి) : నగర వాసుల నడక కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ చిరు వ్యాపారులను ఆదేశించారు. గురువారం చిల్డ్రన్స్ పార్కు, రాంజీనగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణలు తక్షణం తొలగించాలని, దీనిని స్థానిక సచివాలయం, సిటీప్లానింగ్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు, వ్యర్థాలు, మురుగు తొలగింపునకు వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. భవన నిర్మాణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి అనుమతులను బట్టి కట్టడాలను పర్యవేక్షించా లని, అతిక్రమిస్తే పిల్లర్ల దశలోనే కూల్చివేయాలని ఆదేశించారు. కాగా, మున్సిపల్ ఆరోగ్య అధికారి చైతన్య 19వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలించారు.



ఫుట్‌పాత్‌పై టిఫిన్ బండి వ్యాపారికి సూచనలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

న్యూస్ బాక్స్

రూ.29 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 41వ డివిజన్ పరిధిలో రూ.29 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజల సహకారముంటే ఏదైనా చెయ్యగలమని చెప్పారు. కాగా, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడప కార్యక్రమం గురువారం నారాయణరెడ్డిపేటలో మొదలైంది. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రాజకీయాల్లో కొనసాగుతా..'

తాను రాజకీయాల్లో కొనసాగుతానని, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డితో కలిసి నడుస్తానని 31వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకుడు బత్తల క్రిష్ణ తెలి పారు. గురువారం అంబాపురంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. అయితే రూరల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి రాజకీయాల్లో కొన సాగాలని, తన ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

కాంజీవరం రాధాకృష్ణకు అరసం సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మారకనే మారానంటాడు అనే కవితా సంపుటిని వెలువరించిన వీఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు, కవి కాంజీవరం రాధాకృష్ణను అభ్యుదయ రచయి తల సంఘం (అరసం) సత్కరించింది. గురువారం నగరంలోని రమేష్‌రెడ్డి నగర్‌లో ఉన్న రాధాకృష్ణ నివాసానికి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెరుగు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంకటప్పయ్య వెళ్లి సన్మానించారు.

శబరి రామయ్యకు గంధాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో ఐదోరోజు గురువారం ఉదయం స్వామివారికి గంధాభిషేకం కన్నుల పండువగా జరిగింది. నందివర్దన పుష్పాలతో అర్చన, అత్తి సమిధలతో హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉభయకర్తలు కొండా రవీంద్రరెడ్డి, అరుణమ్మ, చంద్రారెడ్డి, రాజు, దయాకర్ తదితరులు పర్యవేక్షించారు.

స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో 'ఇథాకా' ప్రతిభ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 3, (ఆంధ్రజ్యోతి) : నాసా నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్-2025లో ఇథాకా స్కూల్ విద్యార్థులు వరుసగా మూడో సంవత్సరం కూడా ప్రపంచ స్థాయి విజేతలుగా నిలిచారని ఆ స్కూల్ చైర్మన్ ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం కనుపర్తిపాడు వద్దనున్న స్కూల్ ప్రాంగణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజుల క్రితం నిర్వహించిన కాంటెస్ట్‌లో తమ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారని తెలిపారు. మన్నూరు మహిక్షిత్‌రెడ్డి ఫుల్మెన్ ప్రాజెక్టుకు ప్రపంచ స్థాయి రెండవ బహుమతి లభించిందని, మహ్మత్ అమాన్ నాటిలస్ ప్రాజెక్టు ప్రపంచ వ్యాప్తంగా 3వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం ఆ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ జీఎం జీవన్, అకడమిక్ డైరెక్టర్ రాణి, ప్రిన్సిపాల్ శోభన లక్ష్మీనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతికి ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని లస్సీ సెంటర్‌లో ఛత్రపతి శివాజీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. అక్కడి శివాజీ విగ్రహానికి పలువురు నాయకులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఛత్రపతి చేసిన పోరాటాలను మననం చేసుకున్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మరాఠా అసోసియేషన్ నాయకులు భారీగా తరలివచ్చి ఛత్రపతికి నివాళులు అర్పించారు. భారతీయ జనతా పార్టీ నాయకుడు పీ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫణిరత్నం, పిట్టి సత్యానాగేశ్వరరావు, హర్షవర్ధన్, బాలసుబ్రహ్మణ్యం, ప్రకాష్ జడదేవీ, తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పోర్టు రోడ్డుకు భూములిచ్చిన రైతులను ఆదుకోవాలి

గుడ్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణంలో భాగంగా భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం చేవూరు గ్రామసచివాలయ కేంద్రంలో భూములు వివరాలతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేవూరు దళితవాడకు చెందిన 28 మంది చిన్నకారు రైతుల దగ్గర నుంచి గ్రామ సర్వే నెంబర్లు 553లో 13 ఎకరాల 50 సెంట్లు భూమిని పోర్టు అధికారులు తీసుకొని నష్టపరిహారం చెల్లించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సాగు భూమిని కోల్పోయి నిరాశ్రయులైన దళితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు కోరారు.

ఆ అమ్మవారి విగ్రహం మాదే..!

● ఉలవపాటి మల్లిక

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఎంఆర్ నగర్‌లో ఇటీవల బయటపడిన త్రిపుర భైరవి అమ్మవారి విగ్రహం తాము తయారు చేయించిందని, అది 12వ శతాబ్దానిది కాదని ఉలవపాటి మల్లిక అనే మహిళ చెప్పారు. నగరంలోని ఒక సమావేశ మందిరంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 1997 నుంచి తాము వీఎంఆర్ నగర్‌లో నివసిస్తున్నామని, పిల్లల చదువు నిమిత్తం సయ్యద్ మంజూర్ అహ్మద్ అనే వ్యక్తి వద్ద ఇంటి పత్రాలు, బ్యాంకు చెక్కులు ఇచ్చి రూ.2 లక్షలు అప్పు తీసుకున్నానని చెప్పారు. 2018లో కులదైవమైన త్రిపుర భైరవి దేవతా మూర్తి విగ్రహాన్ని తయారు చేయించి ఇంట్లో ప్రతిష్ఠించి పూజలు చేశామని తెలిపారు. కొంత కాలం తర్వాత తాము అప్పు తీర్చినా చెక్కులు మాత్రం ఇవ్వకుండా సయ్యద్ మంజూర్ తనపై చెక్ బౌన్స్ కేసులు వేశారని తెలిపారు. పోలీసుల సహకారంతో తమ ఇంటిని జప్తు చేయడంతో కట్టుబట్టలతో తాము ఇంటి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చిందని, కనీసం విగ్రహాన్ని ఇవ్వమన్నా ఒప్పుకోలేదని చెప్పారు. ఇటీవల ఈ విగ్రహం వీఎంఆర్ నగర్‌లో ఓ స్థలం శుభ్రం చేస్తుండగా దొరికిందని పత్రికల్లో వచ్చిందని చెప్పారు. అది తాము తయారు చేయించిందేనని రూఢీ చేసుకున్నామన్నారు. అక్కడున్న స్థలాలను కబ్జా చేసేందుకే కొంత మంది నాయకులు ఈ విగ్రహంతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిం చారు. అమ్మవారి విగ్రహాన్ని తనకు అప్పగించాలని కోరారు. అనంతరం గండికోట శ్రీరామమూర్తి స్వామి మాట్లాడుతూ మల్లిక విజ్ఞప్తి మేరకు ఆళ్లగడ్డలో విగ్రహాన్ని తయారు చేయించామని, అందుకు సంబంధించిన సాక్ష్యాలన్నీ ఉన్నాయని, ఈ విషయంలో అధికారులు న్యాయం చేయాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లిక

'ఇఫ్కో'లో పరిశ్రమలు స్థాపించండి

కిసాన్ సెజ్ సీఈవోతో ఎంపీ వేమిరెడ్డి భేటీ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధిపై ఆ సంస్థ సీఈవో డాక్టర్ ఉదయ్‌శంకర్ అవస్థితో గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భేటీ అయ్యారు. జిల్లాలోని ఇఫ్కోలో 2770 ఎకరాల భూమి అందుబాటులో ఉందని చెప్పారు. పరిశ్రమలు వస్తే జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుతాయనీ వివరించారు. పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తామని వేమిరెడ్డికి సీఈవో హామీ ఇచ్చారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఎంపీ పరిధిలోని పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని వేమిరెడ్డికి సూచించారు.

● **గిరిజనుల అభివృద్ధికి ప్రోత్సాహకాలేమిటి?**

రాష్ట్రంలో గిరిజన మహిళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటో వివరించాలని ఎంపీ వేమిరెడ్డి గురువారం లోక్‌సభలో ప్రశ్నించారు. కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ సహాయ మంత్రి దుర్గా దాస్ ఉయికే లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఎన్‌ఎస్‌టీ ఎఫ్‌డీసీ వివిధ పథకాల కింద ఆదాయ ఉత్పత్తి కార్యకలాపాలు/ స్వయం ఉపాధిని చేపట్టేందుకు అర్హులైన షెడ్యూల్డ్ తెగలకు రాయితీ రుణాలను అందిస్తోందని తెలిపారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన కింద రూ.2 లక్షల ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం వరకు రుణంగా అందిస్తారన్నారు. సాంకేతిక, వృత్తిపరమైన విద్యను అభ్యసించాలనుకునే ఎస్టీ విద్యార్థుల కోసం ఆదివాసీ శిక్షాగ్రిన్ యోజన కింద రూ.10లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తారని చెప్పారు.



సీఈవో అవస్థికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వేమిరెడ్డి

25న ఏఎల్‌సీసీ చిత్రం విడుదల

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ ఫిల్మ్ సర్క్యూట్ సంస్థ నిర్మాణ సారథ్యంలో వెలీధర్‌రావు కోలా స్వీయ దర్శకత్వం లో నిర్మించిన చిత్రం ఏఎల్‌సీసీ ట్యాగ్‌లైన్ ఓ యనివర్సల్ బాచిలర్ ఈనెల 25న థియేటర్స్‌లో విడుదల అవుతుందని వెలీధర్‌రావు తెలిపారు. గురువా రం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మంచి సందేశంతో ఈ చిత్రం తీశామని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. జేపీ నవీన్‌ను హీరోగా, శ్రావణి శెట్టిని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నామన్నారు. ఈ చిత్రాన్ని తిరుపతి, తలకోన, తూపిలిపాలెం, రామోజీ ఫిల్మ్‌సిటీ, తదితర ప్రాంతాల్లో చిత్రీకరించామని చెప్పారు. విలేకరుల సమావేశంలో నటుడు కుమారస్వామి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిత్రం పోస్టర్లు ఆవిష్కరించారు.

ఎమ్మెల్సీ నాగబాబుకు అభినందనలు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన పార్టీ నాయకుడు కొణిదల నాగబాబుకు పార్టీ జిల్లా నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ అభినందనలు తెలిపారు. గురు వారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నాగబాబును కలిసి సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి నాగబాబు ప్రణాళికాబద్ధంగా పనిచేశారని, భవిష్యత్తులో ఆయన ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

నేడు రీ సర్వే ర్యాలీ, గ్రామసభలు

బిట్రగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ, బిట్రగుంట పంచాయతీలో శుక్రవారం రీ సర్వే ర్యాలీ, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఆయన మండల కార్యాలయంలో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10గంటలకు కడనూతల సచివాలయ పరిధిలో అధికారులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బిట్రగుంట సచివాలయంలో ఉదయం 11గంటలకు ర్యాలీ, రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తామని రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ బీద



ఉపరాష్ట్రపతితో మాట్లాడుతున్న మస్తాన్‌రావు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్‌ను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు గురువారం పార్లమెంట్ భవనంలోని ఉపరాష్ట్రపతి కార్యాలయంలో కలిశారు. ఏపీలో అమలయ్యే సంక్షేమ కార్యక్రమాలతోపాటు పోలవరం, అమరావతి, ముఖ్య మంత్రి నూతనంగా ప్రారంభించిన పీ-4 మోడల్ తదితర కార్యక్రమాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు నాయుడు మంచి పరిపాలనా దక్షత కలిగిన నేత అని, ఆయన పాలనలో ఏపీ అభివృద్ధి చెందుతుందని ఉప రాష్ట్రపతి తెలిపారని బీద పేర్కొన్నారు.




నెల్లూరు-2 డిపో గ్యారేజీ గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి మురళీమోహన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమాలు గురువారం కొనసాగాయి. నెల్లూరు రెండవ డిపో గ్యారేజ్ గేటు ఎదుట ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.







మండే ఎండల్లో చల్లటి నీడ

ఏసీ బస్ షెల్టర్లు అందంగా ముస్తాబు

నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఏసీ బస్ షెల్టర్లు అందంగా ముస్తాబయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఈ షెల్టర్లు ప్రారంభానికి నోచుకోక ముందే 2019లో ఎన్నికలు రావడం, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గతేడాది మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఈ ఏసీ బస్‌షెల్టర్లు ప్రస్తుత వేసవిలో నగరవాసులకు చల్లటి నీడనిచ్చేందుకు సిద్ధమయ్యాయి. గతంలో ఏసీలు చోరీకి గురికావడంతో ఈ సారి కట్టుదిట్టంగా గ్రిల్లు, దానికి తాళాలతో ఏర్పాటు చేశారు.


- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



తిరుపతి జిల్లాకు నేటితో మూడేళ్లు

ఇంకా అద్దె నీడలోనే..

తిరుపతి జిల్లా ఏర్పడి నేటితో మూడేళ్ళు పూర్తయింది. అశాస్త్రీయంగా జరిగిన విభజనతో కాలూచెయ్యీ కూడదీసుకోవడానికే కొత్తజిల్లా సతమతం అవుతోంది. జిల్లా కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తిరుమల శ్రీవేంకటేశ్వరుడూ, విశాలమైన సముద్ర తీరం, శ్రీసిటీ పారిశ్రామిక సముదాయం ఉండబట్టి సరిపోయింది కానీ లేకపోతే తిరుపతి జిల్లా ఈపాటికి కుదేలై కుప్పకూలి ఉండేది. సమర్ధులైన అధికారుల సారధ్యంలో ప్రగతి దిశగా పరుగులందుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రజాప్రతినిధుల తోడ్పాటు జతకలిస్తేనే ఈ పరుగు వేగం అందుకుంటుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మూడు జిల్లాల్లోకి చెల్లాచెదురు

పార్లమెంటు నియోజకవర్గం ప్రాతిపదికన కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినా, తిరుపతి జిల్లాలో దానిని పాటించలేదు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు మాత్రమే పూర్తిగా తిరుపతి జిల్లాలో వున్నాయి. వెంకటగిరి సెగ్మెంట్‌లో మూడు మండలాలు తిరుపతి జిల్లాలో, మూడు మండలాలు నెల్లూరు జిల్లాలో కలిపారు. సర్వేపల్లి సెగ్మెంట్ పూర్తిగా నెల్లూరు జిల్లాలో వుంది. అంటే పార్లమెంటు నియోజకవర్గం మూడు రకాలుగా రెండు జిల్లాల నడుమ చెల్లాచెదురైంది. మరోవైపు చిత్తూరు పార్లమెంటు పరిధిలోని చంద్రగిరి సెగ్మెంట్ పూర్తిగా తిరుపతి జిల్లాలో వుండగా అదే పార్లమెంటు పరిధిలోని నగరి సెగ్మెంటుకు సంబంధించి మూడు మండలాలు చిత్తూరు జిల్లాలో, రెండు మండలాలు తిరుపతి జిల్లాలో కలిపారు. దీనివల్ల పాలనా పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధి, సమస్యలపై రెండు జిల్లాల అధికార యంత్రాంగాలతో ఎంపీలు సంప్రదించాల్సి వస్తోంది. అలాగే వెంకటగిరి, నగరి ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యల గురించి రెండు జిల్లాల అధికారులను కలవాల్సి వస్తోంది. ఎన్నికల నిర్వహణ సైతం ఇబ్బందిగా మారుతోంది. మూడేళ్ళవుతున్నా ఈ అశాస్త్రీయ విభజనను సరిదిద్దనే లేదు.

కంగాళీగా రెవెన్యూ డివిజన్లు

వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వుండగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లా గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, పుత్తూరు మండలాలు తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో వుండగా నగరి, నిండ్ర, విజయపురం మండలాలు చిత్తూరు జిల్లాలోని నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ తదితర మూడు మండలాలు సూళ్ళూరుపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో వుండగా పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం, నారాయణవనం శ్రీకాళహస్తి రెవిన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. దీనివల్ల వెంకటగిరి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలకు సైతం ఆర్డీవోలను కలవడం సమస్యగా మారుతోంది.

విభజన కాని శాఖలు, సంస్థలు

కొత్త జిల్లాల ఏర్పాటు జరిగాక కూడా కొన్ని శాఖలు, పాలకమండళ్ళతో కూడిన సంస్థలు విభజితం కాలేదు. ఉదాహరణకు తిరుపతి జిల్లాలోని సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి కోర్టులు చిత్తూరు జిల్లా జడ్జి నియంత్రణలో వుండగా సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి కోర్టులు నెల్లూరు జిల్లా జడ్జి పర్యవేక్షణ కింద వున్నాయి. మైనారిటీ సంక్షేమ శాఖ,వక్ఫ్ బోర్డు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటివి జిల్లాల నడుమ విభజన కాలేదు. ఇక జిల్లా పరిషత్తు అనేది పంచాయతీ రాజ్ శాఖలో గ్రామీణాభివృద్ధి పరంగా కీలక పాత్ర పోషిస్తుంది. జడ్పీ విభజన జరగకపోవడంతో తిరుపతి జిల్లాలోని 34 మండలాలకు గానూ 20 మండలాలపై చిత్తూరు జడ్పీ నియంత్రణ, పర్యవేక్షణ కొనసాగుతుండగా మిగిలిన 14 మండలాలపై నెల్లూరు జడ్పీ అజమాయిషీ నడుస్తోంది. చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 20 మండలాలు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 14 మండలాలు వున్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల కార్యకలాపాలు కూడా చిత్తూరు, నెల్లూరు జిల్లాల అజమాయిషీలో వున్నాయి. ఇందువల్ల జిల్లా అధికార యంత్రాంగానికి ఆయా శాఖలు, సంస్థలపై పట్టు, నియంత్రణ లేకుండా పోతోంది.

టీటీడీ భవనంలోనే కలెక్టరేట్



మూడేళ్లయినా తిరుపతి జిల్లా కలెక్టరేట్‌కే సొంత భవనం లేదు. యాత్రికుల కోసం టీటీడీ నిర్మించిన పద్మావతీ నిలయంలో తాత్కాలికం పేరుతో మొదలైన పాలన అలాగే కొనసాగుతోంది. ఏడంతస్తులు, 200 గదులతో కూడిన పద్మావతీ నియలంలో 46 శాఖలకు 180 గదులు కేటాయించారు. ఇంకా 20 గదులు ఖాళీగా వున్నాయి. నెలకు రూ. 25,29,755 అద్దె చెల్లించేలా 2022 మార్చి 7 నుంచీ రెండేళ్ళ పాటు లీజుపై ఈ భవనాన్ని కేటాయించారు. రెండేళ్ళ గడువు ముగిశాక 2024 మార్చి 7నుంచీ 2027 మార్చి 6 వరకూ మూడేళ్ళ పాటు లీజు పొడించారు. నెలవారీ అద్దె రూ. 26,05,647గా నిర్ణయించారు. ఇప్పటిదాకా ఈ భవనానికి అద్దెకింద ప్రభుత్వం టీటీడీకి రూ.9,19,81,884లు చెల్లించాల్సి వుండగా, ఇప్పటిదాకి రూ. 5,62,47,187లు చెల్లించారు. రూ. 3,57,34,697 బకాయి ఉన్నారు. ఇక నెలకు విద్యుత్‌కే రూ.9లక్షలు ఖర్చవుతోంది. భవన సముదాయంలో పారిశుద్ధ్యం, సెక్యూరిటీ వంటివి టీటీడీయే చేపడుతోంది. మూడేళ్ళు అయినా ప్రభుత్వం కలెక్టరేట్‌కు సొంత భవనం కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. కనీసం స్థల సేకరణ కూడా జరగలేదు. ఏడాదికి 3 కోట్లకు పైగా అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వం అదే నిధులతో నిర్మాణం చేపడితే అద్దె భారం తగ్గుతుందని పలువురు సూచిస్తున్నారు.

ఎస్పీ ఆఫీసుకు మాత్రమే సొంత నీడ

తిరుపతి జిల్లా ఏర్పాటు కాక మునుపే తిరుపతి కేంద్రంగా అర్బన్ పోలీసు జిల్లా ఏర్పాటైనందున ఎస్పీ కార్యాలయానికి మాత్రమే శాశ్వత భవన వసతి అందుబాటులో వుంది. మిగిలిన ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలకు సొంత భవనాలు లేవు.





శ్రీకాళహస్తిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నడుస్తున్న ఆర్డీవో కార్యాలయం - సూళ్ళూరుపేట రైతు సేవా సహకార కేంద్రం గోదాములో నడుస్తున్న ఆర్డీవో కార్యాలయం

సర్దుకుని నడుస్తున్న ఆర్డీవో ఆఫీసులు

తిరుపతి జిల్లా ఏర్పాటయ్యాక కొత్తగా శ్రీకాళహస్తి రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. దీనికి సొంత భవనం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలోనే నడుస్తోంది. అలాగే నాయుడుపేట కేంద్రంగా మునుపటి నుంచీ వున్న రెవిన్యూ డివిజన్ కేంద్రాన్ని గత వైసీపీ ప్రభుత్వం సూళ్ళూరుపేటకు మార్చింది. అక్కడా ఆర్డీవో కార్యాలయానికి సొంత భవనం లేదు. రైతు సేవా సహకార సంఘం ఆవరణలో గోదాము కోసం నిర్మించిన భవనంలో నడుస్తోంది.



సర్పదోష నివారణ పూజలు చేయించుకుంటున్న పూజా హెగ్డే

ముక్కంటి సేవలో నటి పూజాహెగ్డే

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీ నటి పూజాహెగ్డే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమె ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆమెను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాధికారులు హరియాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీపై కదలిక

నేడు స్పెషల్ డ్రైవ్

తిరుపతి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల జారీపై కదలిక వచ్చింది. బాండ్ల జారీకోసం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం ఆస్తులు పోగొట్టుకున్న చిన్నాచితకా యజమానులకు ఊరట కలగనుంది. గత వైసీపీ పాలనలో టీడీఆర్ బాండ్ల జారీలో పెద్దఎత్తున కుంభకోణం జరిగిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో లావాదేవీలకు నోచుకోని టీడీఆర్ బాండ్లు చెల్లవని ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదించిన 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1,121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. గొల్లవానిగుంట, కొర్లగుంట ప్రాంతాల్లో స్వల్పంగా భూములు కోల్పోయిన వారితో పాటు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొందరికి పెద్దమొత్తంలో బాండ్లు జారీ అయ్యాయి. ఇంకా 1,200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. ప్రతి చదరపు గజానికి రూ.35వేలు చొప్పున 2.80 లక్షల చదరపు గజాల స్వాధీనంతో కూడిన 342 టీడీఆర్ బాండ్ల జారీపై వివరాణత్మక నివేదికను సమర్పించాలని, మొత్తం రూ1,013 కోట్లు టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్టు ఉత్తర్వులో పేర్కొంది. అయితే ఉత్తర్వులు వెలువడే నాటికే 75 శాతం టీడీఆర్ బాండ్లు వినియోగం జరిగిపోయిందని, తక్కిన 25 శాతం మాత్రమే ఉన్నాయని కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీఆర్ బాండ్ల అవినీతిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రెసిడెన్షియల్ స్థలానికి కమర్షియల్ విలువ కట్టి అడ్డగోలుగా టీడీఆర్ బాండ్లు కట్టబెట్టడం ద్వారా కార్పొరేషన్‌కు దాదాపు రూ.150కోట్లు నష్టం వాటిల్లినట్టు విజిలెన్స్ విభాగం ప్రాథమికంగా తేల్చింది. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయమని ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. డాక్యుమెంట్లను పరిశీలించిన కమిటీ లబ్ధిదారులకు బాండ్లను జారీ చేస్తోంది.

స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోండి

టీడీఆర్ బాండ్ల జారీ కోసం శుక్రవారం ఉదయం పది గంటల నుంచి తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొంటారన్నారు. వాలిడేషన్ చేయించుకునేవారు ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని తెలిపారు. ఆన్‌లైన్ ఎండార్స్‌మెంట్, షార్ట్ ఫాల్ ఇచ్చినవారు తగిన డాక్యుమెంట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ మూల్యాంకనం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి మూల్యాంకనం గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఈనెల 9వ తేదీ వరకు 1.85 లక్షల జవాబు పత్రాలను 775 అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేయనున్నారు. మొదటిరోజు 22,775 పత్రాలను మూల్యాంకనం చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. ఇదిలా ఉండగా మూల్యాంకన కేంద్రంలో సాయంత్రం 4.30 గంటల సమయంలో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పది నిమిషాల్లో మళ్లీ సరఫరా పునరుద్ధరణ కావడంతో పెద్దగా ఇబ్బంది ఏర్పడలేదు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరామని డీఈవో చెప్పారు.

‘ఉచితం’ ముసుగులో ఇసుక అక్రమ రవాణా

అరుణా నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు



సత్యవేడు/పిచ్చాటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): భవన.. ప్రభుత్వ నిర్మాణ పనులకు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెట్టింది. సమీపంలోని నదులు, వాగుల నుంచి తరలించుకునే వీలు కల్పించింది. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు ఉచితం ముసుగులో అక్రమ రవాణాకు తెరలేపారు. ఇలా నాగలాపురం, పిచ్చాటూరు మండలాల సరిహద్దులో అడవి కొడియంబేడు, బైట కొడియంబేడు గ్రామాల పరిధిలోని అరుణా నది నుంచి ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి వేళ ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తోడి సమీప ప్రాంతాల్లో డంప్ చేసి.. ట్రాక్టర్ల ద్వారా రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నాగలాపురం, పిచ్చాటూరు మండలాల మీదుగా ఇసుక తీసుకెళుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా, పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో అరుణానది పరివాహ ప్రాంతాల నుంచి తరలిస్తున్న ఇసుకను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఐదు రోజులుగా ఇసుకను తీసుకెళ్లి మామిడి తోటలో డంప్ చేసి రాత్రి వేళలో టిప్పర్ల ద్వారా తమిళనాడుకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తుండడంతో కొందరు ట్రాక్టర్లను అడ్డుకున్నారు.

7 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవలను ఈనెల 7వ తేదీ నుంచి నిలిపివేస్తున్నామని, దయచేసి తమను అర్థం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) గురువారం ఓ ప్రకటనలో కోరారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధపడుతూనే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.3,500 కోట్లు రావాల్సి ఉందని, తాము మోయలేనంతటి ఆర్థిక భారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

విద్యుత్ అదనపు లోడ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రేణిగుంట సబ్ డివిజన్ డీఈఈ రమేష్ తెలిపారు. జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) 50 శాతం రాయితీ కల్పించిందని వెల్లడించారు. ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో దరఖాస్తులో అంగీకరించిన లోడ్ కంటే ఎక్కువ వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు.

విచ్చలవిడిగా క్వారీ పేలుళ్లు

- నాలుగు గ్రామాల్లో భయానక వాతావరణం
- రాయితగలడంతో తలపగిలి ప్రాణాపాయ స్థితిలో బాలుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

పుత్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన పల్లెలో ఆరుబయట నిద్రించలేరు. పగటి పూట మామిడి తోటల్లో పశువులను మేపుకొనే పరిస్థితి లేదు. ఎందుకంటే.. క్వారీలో ఎప్పుడు పేలుడు సంభవిస్తుందో.. ఏ రాయి వచ్చి తగులుతుందోనన్న ఆందోళన వారిని పట్టి పీడిస్తుంది. ఇలాంటి భయానక పరిస్థితి పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వరాపురం, దళితవాడ, యానాదికాలనీ, బొజ్జనత్తం ప్రజలు ఎదుర్కొంటున్నారు.

ఈశ్వరాపురం మామిడితోటలో కాపలా వున్న రామయ్య మూడేళ్ల కుమారుడు దినేశ్ బుధవారం మధ్యాహ్నం గుడిసె ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో మైనింగ్‌లో జరిపిన బ్లాస్టింగ్ వల్ల ఓ పదునైన రాయి వచ్చి ఆ బాలుడి తలను తాకింది. వెంటనే రక్తం మడుగులో పడిపోయాడు. హుటాహుటిన పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఇంకా పిల్లవాడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఇలాంటి ఉదంతాలు ఎన్నెన్నో.. ఆ నాలుగు గ్రామాల్లో బ్లాస్టింగ్ కుదుపుల వల్ల ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. టీవీలు కింద పడి పగిలిపోతున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని గ్రామస్థులు అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, సదస్సుల్లో వినతులు ఇచ్చినా ఫలితం శూన్యం. ఈ ఉదంతాన్ని గురువారం పుత్తూరు వచ్చిన కలెక్టర్ దృష్టికి సీపీఎం కార్యదర్శి వెంకటేశ్ నాయకత్వంలో ఆ కాలనీవాసులు తీసుకువచ్చారు. కలెక్టర్ ఆదేశం మేరకు హుటాహుటిన సాయంత్రం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మైనింగ్ నిర్వాహకులను పిలిచి ప్రభుత్వ అనుమతులన్నింటిని శుక్రవారం మధ్యాహ్నం తీసుకురావాలని ఆదేశించారు. మైనింగ్ నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశానికి మైనింగ్ బాధితులూ రావాలని తహసీల్దార్ కోరారు.



మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించిన తహసీల్దార్, సీపీఎం నేతలు



తిరుమలలో టీటీడీ అధికారులు నివాసముండే బీటైప్ క్వార్టర్స్ వద్ద గురువారం ఆరు అడుగుల నాగుపాము పట్టుబడింది. 60వ నెంబరు గదికి సమీపంలో పాము కనిపించడంతో భాస్కరనాయుడుకు సమాచారం ఇచ్చారు. వెంకటనే అక్కడికి చేరుకున్న ఆయన పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సంగీత స్వరాల్లో వేదాలు



ఆలయం ముందు సంగీత దర్శకుడు కోటి

● అదే నా చివరి కోరిక

'స్వామి వైభవాన్ని తెలిపేలా అనేక అన్నమయ్య కీర్తనలు చేసిన నేను ఓ మహా యజ్ఞ కార్యక్రమానికి పూనుకున్నా. నాలుగు వేదాలను సంగీత రూపంలో తీసుకురావాలనుకుంటున్నాను. ఇదే నీ చివరి కోరిక కూడా' అని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇంతవరకు ఎవ్వరూ చేయని కార్యానికి తాను సంకల్పించానని చెప్పారు. ఇది ఎన్నేళ్లకు పూర్తవుతుందో కూడా తెలీదని, దేవుడు, అభిమానుల ఆశీస్సులతో పూర్తి అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావాలని కోరుకునేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. ఇటీవల వాసవి కన్యాకపరమేశ్వరిపై 'వాసవి సాక్షాత్కారం' అనే ఆల్బమ్ చేయగా మంచి ఆదరణ లభించిందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు మంత్రి నాదెండ్ల పర్యటన

వడమాలపేట/తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని జేసీ శుభం బన్సల్ గురువారం తెలిపారు. వడమాలపేట మండలం తిరుమణ్యం రైతు సేవా కేంద్రం పరిధిలోని ఎనమలపాలెంలో ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభించి, రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాన్ని ఆర్డీవో రామ్మోహన్, జిల్లా సివిల్ సప్లై అధికారి సుమతి, తహసీల్దార్ జరీనా, వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. సాయంత్రం 5గంటలకు తిరుపతి నగరం కెనడీ నగర్‌లో సిలిండర్ పంపిణీ చేసి తిరుమల వెళ్లనున్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు


తిరుమలలో సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 12 గంటల పాటు వేచి ఉండక తప్పదు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,721

తలనీలాలు సమర్పించినవారు: 25,545





'దశ' దిశలా విద్యా సౌరభాలు

బోధన,పరిశోధనల్లో అగ్రపథాన తిరుపతి ఐఐటీ

తిరుపతి ఐఐటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ) పదేళ్లు పూర్తి చేసుకుంది. బాలారిష్టాలను అధిగమించి సగర్వంగా తలెత్తుకునే స్థితికి చేరింది. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల సరసన చోటు సంపాదించింది. ఏటా నిపుణులైన ఇంజనీర్లను అందిస్తూ సాంకేతిక ప్రగతిలో పాలుపంచుకుంటోంది. ఆరంభంలో తాత్కాలిక భవనాల్లో అవస్థలు పడినా నేడు విశాలమైన క్యాంపస్‌గా రూపుదిద్దుకుంది. ఎన్నో ఆవిష్కరణలు,పరిశోధనలతో అగ్రగామిగా దూసుకువెళ్తోంది. నేడు పదో వార్షికోత్సవ సందర్భంగా ఈ విద్యా సంస్థ ప్రస్థానాన్ని పరికిస్తే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర విభజనలో భాగంగా 2015 కేంద్ర ప్రభుత్వం తిరుపతిలో ఐఐటీ ఏర్పాటు చేసింది. ఆరంభంలో చదలవాడ విద్యాసంస్థల ప్రాంగణంలోని తాత్కాలిక భవనంలో తరగతులను ప్రారంభించింది. నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ జాతీయ విద్యాసంస్థకు ఏర్పేడు మండలం మేర్లపాకలో 560 ఎకరాలను కేటాయించారు. దీనివిలువ సుమారు వెయ్యి కోట్లరూపాయలపైనే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వమే రూ.12 కోట్లతో భూమి చుట్టూ ప్రహరీని ప్రభుత్వం నిర్మించింది. ఐఐటీ సొంత గూటికి టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించింది. 106 మంది విద్యార్థులతో ఐఐటీ విద్యా ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. ఏడేళ్ల తర్వాత(2022 ఆగస్టు 1న) మేర్లపాక వద్ద సువిశాల ప్రాంగణంలోకి ఈ విద్యా సంస్థ అడుగుపెట్టింది. గడచిన పదేళ్లుగా అధికారయంత్రాంగం,బోధనాసిబ్బంది అవిరళ కృషి ఫలితంగా అంచెలంచెలుగా విద్యాసంస్థ ముందంజ వేయగలిగింది. అత్యాధునిక ప్రయోగశాలలు, హాస్టల్ భవనాలు, తరగతి గదులు, క్రీడా సౌకర్యాలను సమకూర్చుకుంది. మద్రాస్ ఐఐటీ పర్యవేక్షణలో స్వయంప్రతిపత్తి హోదాతో ఇక్కడ బోధన, పరిశోధన నిర్విరామంగా సాగుతోంది. ఇప్పటివరకూ ఆరు బ్యాచుల్లో 2వేల మందికిపైగా ఐఐటీయన్లను జాతికి అందించింది.

ప్రధాన కోర్సులివే..

ఏటా బీటెక్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో 244 మంది విద్యార్థులకు ప్రవేశాలను పొందుతున్నారు. కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచులతోపాటు ఎంటెక్, ఎంఎస్(పరిశోధన ద్వారా), ఎమ్మెస్సీ, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ), పీహెచ్‌డీ సహా అనేక పీజీ ప్రోగాంలను తిరుపతి ఐఐటీ అందిస్తోంది. ప్రస్తుతం 1667 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు.

అకడమిక్ మైలురాళ్లు : ఇక్కడి ఐఐటీలో విభిన్న నైపుణ్యం కలిగిన 139 మందికి పైగా అధ్యాపకులున్నారు. దాదాపు 1266 ప్రచురణలకు సమర్పించారు. 203వరకు ప్రాయోజిత పరిశోధన ప్రాజెక్టులు, 209 ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీల ప్రాజెక్టులను చేపట్టారు. ఇప్పటివరకు 25 పేటెంట్లను దాఖలు చేశారు. పలు సంస్థల నుంచి ఎంవోయూలను చేసుకున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)- 2022లో మొదటి భాగస్వామ్యంలో ఈ ఐఐటీ ఇంజనీరింగ్ విభాగం 56వ ర్యాంకు పొందింది. ఇది అకడమిక్ ఎక్సలెన్స్‌లో సాధించిన విజయానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

రీసెర్చ్ క్యాంపస్

క్యాంపస్‌లో పదెకరాల విస్తీర్ణంలో విస్తరించిన రెండు సరస్సులు ఉన్నాయి. నీటి నిర్వహణ వ్యవస్థలో 600 కెఎల్డీ నీటి శుద్ధి విభాగం, రెండు మురుగునీటి శుద్ధి యూనిట్లు, రీసైకిల్ చేసిన నీటిని ఉపయోగించే మైక్రో ఇమేజింగ్ వ్యవస్థ ఏర్పాటయ్యాయి. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్, శీతలీకరణ వ్యవస్థ, అగ్నిమాపక భద్రతా వ్యవస్థలను సమకూర్చుకుంది. పచ్చదనం పరుచుకున్న ఇక్కడి వాతావరణం ఆహ్లాదం పంచుతుంది. 5,250 చెట్లు, 110,000 పూల మొక్కలు, 260 ఔషధ మొక్కలు, జీవవైవిధ్యతోటలు స్వాగతం పలుకుతాయి.

ఎంవోయూలతో ముందడుగు

సహకార పరిశోధన, విద్యాపరమైన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి తిరుపతి ఐఐటీ దాదాపు 50 విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుచేసుకుని ముందడుగు వేస్తోంది. యూఎస్ఏ, నార్వే, కెనడా వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు ఇండియన్ నేవీ, ఎన్‌హెచ్ఏఐ, సీఎస్ఐఆర్ ఎన్ఈఆర్ఎల్, ఇండియన్ నావల్ అకాడమీ, హిందూస్తాన్ షిప్‌యార్డ్ సంస్థలో ఎంవోయూ చేసుకుంది. పీహెచ్‌డీ ప్రోగ్రాంపై నార్వే యూనివర్సిటీతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది.

విద్యార్థి విజయాలు

- రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ నిర్వహించిన గ్లోబల్ ఆన్‌లైన్ పోస్టర్ సదస్సులో సివిల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పీహెచ్‌డీ స్కాలర్ ఎంఎస్సీ నాగజ్యోతి రెండవస్థానంలో నిలిచారు.
- టూ మ్యూనిచ్‌లో పరిశోధనకు కెమికల్ ఇంజనీరింగ్ పీజీ విద్యార్థి ఆదిత్యన్ డాడ్ కోస్‌పీ స్కాలర్‌షిప్‌ను అందుకున్నారు.
- పరిశోధక విద్యార్థులు విరిత్, ప్రశాంత్ ఆర్‌డబ్లుటీహెచ్ వర్సిటీలో డాడ్ ద్విజాతీయ డాక్టోరల్ స్కాలర్‌షిప్‌లను పొందారు
- బీటెక్ విద్యార్థి చిరాగ్ కోటియన్ టొరొంటో వర్సిటీ మిటాక్స్ ఇంటర్న్‌షిప్‌ను పొందారు.



కేంద్ర నిధులతో మౌలిక వసతులు



అంకిత భావంతో పనిచేసే సిబ్బంది, విద్యార్థుల పట్టుదల, ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చే పరిశ్రమల సహకారం ఐఐటీ అభివృద్ధి వెనుక ఉన్నాయి.. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా నిధులు ఇవ్వడంతో మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమైంది. ప్రారంభం నుంచి మద్రాస్ ఐఐటీ మార్గదర్శకత్వం వహిస్తోంది. శుక్రవారం పదో వార్షికోత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ-తిరుపతి





అధ్యాపకుల అవార్డులు

- అంతర్జాతీయ ఇంజనీరింగ్, ఆహార సంఘంచే ప్రొఫెసర్ కెఎస్ఎంఎస్ రాఘవరావు ప్రతిష్టాత్మకమైన లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.
- డాక్టర్ అజయ్‌కుమార్ చంద్రమీనన్ ప్రతిభ అవార్డు అందుకున్నారు
- ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ యూఎస్ఎన్ఏఈలో అంతర్జాతీయ సభ్యులుగా నియమితులయ్యారు.





భక్తుడికి తిరిగి బంగారు గొలుసు అందజేస్తున్న అధికారులు

మరచిపోయిన బంగారు గొలుసు తిరిగి అప్పగింత

కాటేజీ గదిలో మర్చిపోయిన బంగారు గొలుసును టీటీడీ అధికారులు భక్తులకు తిరిగి అప్పగించారు.నెల్లూరుకు చెందిన సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తిరుమలకు వచ్చి సన్నిధానం అతిథిగృహంలో దిగారు. దర్శనం అనంతరం గురువారం గది ఖాళీ చేస సమయంలో 40 గ్రాముల బంగారు గొలుసును మర్చిపోయి వెళ్లిపోయారు. ఆతర్వాత గుర్తించిన సిబ్బంది దానిని అధికారులకు అందజేశారు. వివరాలు సేకరించిన అనంతరం సూపరిటెండెంట్ భాస్కర్‌నాయుడు, మేనేజర్ కామేశ్వరరావు, సబార్డినెంట్ చంద్రశేఖర్ విజిలెన్స్ ఆధ్వర్యంలో భక్తులకు గొలుసు అప్పగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఇబ్బంది పెట్టే నైజం నాది కాదు

● నమ్మకద్రోహం మానుకోండన్న ఎమ్మెల్యే ఆదిమూలం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'ఇబ్బంది పెట్టే నైజం నాది కాదు. అందరినీ కలుపుకొని పోయే మనస్తత్వం. కొంత మంది నాయకులు నమ్మకద్రోహం మానుకోవాలి'అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. తనను గత ఎన్నికల్లో ఓడించాలని కొంత మంది టీడీపీ నాయకులు ప్రత్యర్థి పార్టీతో చేతులు కలిపినా తాను వారిని విమర్శించలేదన్నారు. తాను వైసీపీ నాయకులకు పనులు చేయడం, మాట్లాడటం చేయలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.20కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి నాయకులను కాదని ఏ పనైనా తాను చేసుంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఊపిరి ఉన్నంత వరకు పార్టీకి విధేయుడిగానే ఉంటామన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ప్రజలు తనను నేరుగా కలిస్తే పనిచేయిస్తామన్నారు. ఎవరినో నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. పార్టీలో కష్టపడ్డవారికే నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, నాయకులు నందకిషోర్ రెడ్డి, జయశంకర్‌రెడ్డి, నిర్మల్, మురళి నాయుడు పాల్గొన్నారు.

శ్రీసిటీలో రష్యన్ ఫెడరల్ కాన్సుల్ జనరల్

● పెట్టుబడి అవకాశాలపై పరిశీలన

సత్యవేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్‌జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. ఇండో రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెన్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తు చేశారు. మరిన్ని రష్యన్ పరిశ్రమలు శ్రీసిటీని ఎంచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీలోని మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూలత వాతావరణం, వేగవంతమైన అభివృద్ధి తదితర అంశాలపై కాన్సుల్ జనరల్ బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివశంకరన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. శ్రీసిటీకి ఉన్న బహుళ ప్రయోజనాల దృష్ట్యా విభిన్న తయారీ రంగాలకు చెందిన మరిన్ని రష్యన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని వాలెరీ ఖోడ్‌జేవ్ తెలిపారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెన్ అజోట్ పరిశ్రమను సందర్శించిన ఆయన.. అనంతరం సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ ఎండీ నిశ్చల్ పాద్యాతో చర్చలు జరిపారు.



శ్రీసిటీ ప్రతినిధులతో కాన్సుల్ జనరల్ సమావేశం

వైభవంగా కోదండరాముడి రథోత్సవం





అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

● నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం 9.15 గంటలకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు రథాన్ని అధిష్ఠించి నాలుగు మాడవీధుల్లో విహరించారు. జైశ్రీరామ్ అని నినదిస్తూ భక్తులు రథాన్ని లాగారు. పలు సంఘాలు, భక్తులు మజ్జిగ, పానీయాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తిరుమంజనం, ఆస్థానం చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు ఊరేగారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

శుక్రవారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం నిర్వహిస్తారు.

నేటి నుంచి శ్రీరామనవమి ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్/శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం నుంచి 11వ తేది వరకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజూ ఉదయం 8గంటలకు విష్ణునివాసం, శ్రీనివాసం నుంచి హైటెక్ నాన్ ఏసీ బస్సు ఒంటిమిట్ట, దేవునికడప, తాళ్లపాక, నందలూరు మళ్లీ తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. రూ.700 ప్రయాణ చార్జీగా నిర్ణయించామని, మరిన్ని వివరాలకు 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సహ న్యాయవాదులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా సోమిశెట్టి ఉమాశంకర్ ఎన్నికయ్యారు. గురువారం గూడూరు కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా కే.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా షేక్ వహిదా, లైబ్రరీ సెక్రటరీగా యూసఫ్, స్పోర్ట్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా నవకోటి, సుమన్, ఏడుకొండలు, మహబూబ్‌బాషాతోపాటు మహిళా ప్రతినిధిగా ఎస్‌కే నాగూరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● సహాయకార్యదర్శి స్థానానికి జరిగిన ఎన్నికలో ఎం.శ్రీనివాసులు, అరవ పార్వతయ్యపై గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ఎండీ సర్దార్ ప్రకటించారు.

కక్ష పూరితంగా వక్ఫ్ చట్ట సవరణ



మాట్లాడుతున్న వైసీపీ మైనార్టీ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని సవరించడం ముస్లింలపై బీజేపీ కక్షపూరిత చర్యేనని వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ మగ్దూం విమర్శించారు. స్థానిక వైసీపీ మైనార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులను బీజేపీ సానుభూతి పరులకు కట్టబెట్టేం దుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ముస్లిం నాయకులు కాలేషా, జలీల్, అల్తాఫ్, మస్తాన్‌సాహెబ్, షఫీ, గౌస్‌బాషా, మస్తాన్‌బాషా, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి స్తంభాల గిరీశ్వరుడి తిరునాళ్ల



ఆలయంలో తిరునాళ్ల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరునాళ్ల వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రయ్యనాయుడు, ఈవో శ్రీనివాసులు

డక్కిలి, ఏప్రిల్ 3 : (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన దేవునివెల్లంపల్లిలో స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ల ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. తిరునాళ్లకు సంబంధించిన పోస్టర్లను తిరునాళ్ల వ్యవహారాల ఇన్‌చార్జి మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్యనాయుడు, ఈవో శ్రీనివాసులు గురువారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్యనాయుడు మీడియాతో మాట్లాడుతూ ఈ తిరునాళ్లకు లక్షకుపైగా భక్తులు హాజరవుతారని చెప్పారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తిరునాళ్ల విజయవంతం చేస్తామన్నారు. రాపూరు, వెంకటగిరి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతారని చెప్పారు. వేసవి కావడంతో భక్తుల కోసం పెద్ద ఎత్తున చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకొనేలా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు, అర్చకులు, డక్కిలి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

అనారోగ్య బాధితుడికి ప్రభుత్వం అండ

● రూ.7లక్షలు మంజూరు ● చెక్కు అందించిన ఎమ్మెల్యే విజయశ్రీ



బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే టీడీపీ నాయకుడు శ్రీనివాసులనాయుడు తదితరులు

సూళ్లూరు పేట, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడున్న వ్యక్తికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో ప్రభుత్వ సహాయ నిధి (ఎల్‌వోసీ) ద్వారా రూ.7 లక్షల మంజూరైంది. దొరవారిసత్రం మండలం కట్టువపల్లి గ్రామానికి చెందిన అందలమాల వెంకటాద్రి మెదడు సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ సహాయ నిధి ద్వారా మెదడు శస్రచికిత్సకు రూ.7 లక్షల మంజూరు చేశారు. ఈ మేరకు బాదితుడి కుటుంబ సభ్యులకు నగదు చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసుల నాయుడు తదితరులు ఉన్నారు.

షార్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సింజిత్ కుమార్, డీసీ నీలేష్ గౌర్, పక్కనే సంరక్షిత అధ్యక్షురాలు పల్లవి శర్మ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): షార్‌లోని సీఐఎస్ఎఫ్ యూనిట్ కార్యాలయం వద్ద గురువారం సీఐఎస్ఎఫ్ సంరక్షిక (సీఐఎస్ఎఫ్ భారత సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సంరక్షిక అధ్యక్షురాలు పల్లవి శర్మ, ఉపాధ్యక్షురాలు మీనా గౌర్ విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ నీలేష్ గౌర్ నేతృత్వంలో మాదకద్రవ్యాల వ్యసనంపై అవగాహన కల్పించారు. ముందుగా సీఐఎస్ఎఫ్, మెరైన్ సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

రైతులందరికీ ఒకే విధమైన పరిహారం ఇవ్వాలి

చిల్లకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ఒకే విధమైన పరిహారం ఇవ్వాలని క్రిస్ సిటీ భూ బాధితులు, తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరారు. గురువారం తమ్మినపట్నంలోని క్రిస్ సిటీ భూములను జేసీ శుభం భన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో లింగవరం గ్రామసమీపంలో రైతులు వారిని కలిశారు. డీకేటీ, సీజేఐఎఫ్ భూములకు సైతం సెటిల్‌మెంట్ భూములకు ఇచ్చినట్లే పరిహారం ఇవ్వాలని విన్నవించారు. వారితో పాటు తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

నైపుణ్యం వెలికితీయండి



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ ఏవీ రమణ, ప్రణతి సంస్థ నిర్వహకులు సుంకర రవి

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉండే నైపుణ్యం వెలికితీసి వారికి నచ్చిన రంగాల్లో విజయం సాధించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సీఐ రమణ అన్నారు. గురువారం స్థానిక పింజలి వీరయ్య కల్యాణ మండపంలో ప్రణతి సంస్థ ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది శతక పద్యరత్న బాల పురస్కారాలు ప్రదానం చేశారు. శతక పద్యాలు ఆలపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీహరి, ఓంకార్, రోశయ్య, మల్లయ్య, రాజేష్, సుబ్బారావు, చాముండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో క్యాంపస్ సెలక్షన్స్



కంపెనీ ప్రతినిధులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రముఖ బల్క్ డ్రగ్ సంస్థ దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ వారిచే క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్‌కుమార్ తెలిపారు. మొత్తం 96 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు కే.రామకృష్ణ, బి.తిరుపతయ్యలు విద్యార్థులకు మొదటి రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శివ కుమార్ తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పిరామ్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌స్పిరాన్-2025 సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 12 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 85 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా కళాశాలల విద్యార్థులు ప్రాజెక్టు ఎక్స్‌పో, పేపర్ ప్రెజెంటేషన్, పోస్టల్ ప్రజెంటేషన్ పోటీల్లో పల్గొన్నారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

సంక్షేమం వైపు అడుగులు వేయాలి

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలు ప్రతి రూపాయినీ దాచుకొని ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పేదరికాన్ని జయించాలని వెలుగు ఏపీఎం అనీలా కోరారు. వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, సంఘబంధ అధ్యక్షులతో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏపీఎం పొదుపు సంఘాల క్రెడిట్, లైవ్లీహుడ్‌లపై శిక్షణ ఇచ్చారు. 9 మంది వీవోఏలకు ఇన్యూమరేటర్ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీకాంత్, ప్రసాద్, శంకరయ్య, భాస్కర్, అలివేలమ్మ, బిందు ఉన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ



మధుసూదన్‌రెడ్డి తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్వజ్ఞకుమారయాచేంద్ర

బాలాయపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు గ్రామానికి చెందిన వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి తల్లి వెందోటి సుగుణమ్మ ఇటీవల మృతిచెందారు. గురువారం వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమారయాచేంద్ర జయంపులోని మధుసూదన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. సుగుణమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెందోటి మధుసూదన్‌రెడ్డి, వెందోటి మనోహర్‌రెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డిలను పరామర్శించారు. ఆయన వెంట రామయ్య తదితరులు ఉన్నారు.

పడిపోతున్న పుచ్చ ధరలు





కోట మండలం గూడలి వద్ద పుచ్చకాయలు కోస్తున్న కూలీలు, లారీకి లోడ్ చేస్తున్న కృష్ణ పుచ్చకాయలు

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లో ఈ ఏడాది పుచ్చసాగు విస్తారంగా పెరిగింది. రెండేళ్లుగా పుచ్చ దిగుబడులు లేక, ధరలు సరిగా లేక దెబ్బతిన్న రైతులంతా ఈ ఏడాది పుచ్చసాగును విస్తారంగా చేపట్టారు. అయితే ఈ ఏడాది పుచ్చ దిగుబడులు బాగా ఉన్నప్పటికీ ధరలు పతనం అవుతుండటంతో పుచ్చరైతులు లబోదిబో మంటున్నారు. తీరప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఈ ఏడాది రైతులు ఫిల్టర్ పాయింట్‌లు, చెరువుల కింద పుచ్చ సాగు అధికంగా చేపట్టారు. కోట మండలంలో ఈ ఏడాది ఎక్కువగా గూడలి, రాజుపాళెం, దక్షిణ పొలం, కేశవరం, రాఘవాపురం, చిట్టేడు, రుద్రవరం, ఊనుగుంటపాళెంలతోపాటు పలు గ్రామాలలో విస్తారంగా పుచ్చసాగు చేపట్టారు. ప్రతి సంవత్సరం ఈ ప్రాంత రైతులు ఎక్కువగా నామ్‌దారి రకం పుచ్చను సాగుచేస్తూ ఉండేవారు. గత ఏడాది ఈ సాగులోనూ పెద్దగా దిగుబడులు రాకపోవడం, టన్ను రామ్‌దారి పుచ్చకాయలు రూ. 5వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే పలికాయి. నష్టాలతో దెబ్బతిన్న పుచ్చరైతులు ఈ ఏడాది కొత్తగా కృష్ణ అనే కొత్తరకం పుచ్చను సాగుచేశారు. ఈ రకం పుచ్చ ఉత్తరాదిలో ఎక్కువగా పండిస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడి రైతులు కృష్ణసాగును చేపట్టారు. దిగుబడులు కూడా బాగానే వచ్చాయి. దిగుబడులను దృష్టిలో ఉంచుకొని రైతులు ధరలపై ఆశలు పెంచుకున్నారు. అయితే ప్రస్తుతం కృష్ణ పుచ్చకాయలు టన్నుధర రూ.6వేల నుంచి రూ.7,200 వరకు పలుకుతుంది. ఇదే రకం పుచ్చకాయలు తమిళనాడు సరిహద్దు ప్రాంతాలలో టన్ను రూ..8వేలకు పైగా పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఢిల్లీ, ఆగ్రా, బెంగళూరు ప్రాంతాలలో పుచ్చకాయల ధరలు పడిపోయాయని అడిగేనాధుడే లేడని దళారులు ప్రచారం చేస్తూ ఇక్కడి రైతులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. బయట ప్రాంతాలకు స్తోమత ఉన్న రైతులు తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారు. సన్న, చిన్నకారు రైతులు మాత్రం దళారులు అడిగిన ధరలకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చదువుకున్న కళాశాల రుణం తీర్చుకుంటా



కంప్యూటర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న కళాశాల అభివృద్ధికి అన్నివేళలా సహకారం అందించి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎండబ్ల్యు కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేఆర్ కళాశాలకు వితరణగా అందజేసిన 10 కంప్యూటర్లను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ తాను ఇదే కళాశాలలో చదువుకున్నానని గుర్తుచేసుకున్నారు. ఈ కళాశాల నుంచే నాయకుడిగా ఎదిగానని కళాశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ఆ ప్రేరణతోనే కళాశాల అభివృద్ధికి అన్నివిధాలా తాను సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఇటీవల ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తద్వారా కళాశాలకు, కన్నతల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, రహీం, లీలావతి, బుజిగేంద్రరావు, శ్రీనివాసులురెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదిరులు పాల్గొన్నారు.

చెంబేడు మినీ రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయండి



మంత్రి నిమ్మల రామానాయుడును కలిసిన టీడీపీ నాయకులు

పెళ్లకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : చెంబేడు చెరువు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ నాయకులు కోరారు. గురువారం అమరావతిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలో నెలకొన్న సాగు, తాగునీటి వనరుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా నిర్మిస్తే దాదాపు 15 గ్రామాలకు పైగా సాగు, తాగునీటి సమస్య తీరుతుందన్నారు. గతంలో వచ్చిన వరదలకు చెరువులు, చెరువులకు సాగు నీరందించే కాలువలతో పాటు గేట్లు దెబ్బతినగా గత వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి రామానాయుడు నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్‌మోహన్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్యనాయుడు, కృష్ణమనాయుడు, మురళీనాయుడు తదితరులు ఉన్నారు.

గర్భకండ్రిగ భూములకు మోక్షం కలిగిస్తాం



గర్భకండ్రిగ భూముల రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన

కోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 20 యేళ్లుగా పరిష్కారానికి నోచుకోని గర్భకండ్రిగ భూములకు (చేతుల వృత్తుల వారికి వెంకటగిరి సంస్థానం వారు ఇచ్చిన ఇనాం భూములు) పది రోజుల్లో మోక్షం కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు తెలిపారు. కోట మండలం వెంకన్నపాళెంలోని గర్భకండ్రిగ భూములను గురువారం వారు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఉన్న 346.77 ఎకరాల రైతుల భూములు గర్భకండ్రిగ జాబితాలో ఉన్నాయి. 20 ఏళ్ల నుంచి ఈ భూములను అమ్ముకోలేక కొనుగోలు చేయలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వెంకన్నపాళెం రైతులు అధికారుల ఎదుట వాపోయారు. స్పందించిన జేసీ, సబ్ కలెక్టర్లు అక్కడ ఉన్న భూములను స్వయంగా పరిశీలించి తక్షణం నివేదికలు తయారుచేయాలని తహసీల్దారు జయజయరావును, మండల సర్వేయర్ ను ఆదేశించారు. పది రోజుల్లో రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపుతామని జేసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాళెం సర్పంచ్ కొకర్ల మధుయాదవ్, స్థానిక రైతులు ఉన్నారు.

పరశురాముడిగా శ్రీరాముడి దర్శనం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట బ్రాహ్మణ వీధిలోని సీతా రాముల ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామచంద్రుడు పరశురాముడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా బాలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా కోదండరాముడు భక్తులను అనుగ్రహించారు.

తడ : బోడిలింగాలపాడు వద్ద ఉన్న సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం మొదలయ్యాయి. ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక యాగాలు నిర్వహించారు. 108 కలశాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. శుక్రవారం కుంభాభిషేకం జరుగుతుందని ఆ తరువాత ప్రతి రోజూ యాగాలు జరుగు తాయని, ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహిస్తామని పండి తులు వివరించారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థికి అభినందనలు



బాలాయపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండేరెడి ్డపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న తిరుమల శెట్టి విష్ణురేఖ 2025-26 విద్యాసంవత్సరంలో నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధిం చింది. మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, ప్రదీప్ కుమార్, టీచర్లు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి వెంకటరమణయ్య, భారతి, అంబటి బాలరాజు తదితరులు ఉన్నారు.

వైసీపీ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

నాయుడుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులపై ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. నాయుడుపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

రాబోయే రోజులన్నీ వైసీపీవే

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజులన్నీ వైసీపీవే నని ఆ పార్టీ వెంకటగిరి సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌వలో కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీన మున్సిపల్ అవిశ్వాస తీర్మానంలో వైసీపీ నెగ్గుతుం దని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పాల్గొన్నారు.

నేడు ఓజిలిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగసభ

ఓజిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మండల స్థాయి ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చిన్నయ్య గురువారం తెలిపారు. ఉపాధిహామీ ఉన్నతాధికారులు, తనిఖీ అధికారులు పాల్గొంటారని వివరించారు.

వైభవంగా హజరత్ అమీర్‌షావలి ఉరుసు ప్రారంభం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పడమటి వీధిలోని పార్కులో ఉన్న గాంధీ విగ్రహానికి హిందూ, ముస్లింలు పూలమాలలు వేసి ఉరుసును ప్రారంభించారు. హజరత్ అమీర్‌షావలి దర్గాలో భక్తులు బెల్లం, బొరుగులు, శనగలు చదివింపులుచేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ముజావర్ నుంచి ఆశీర్వాదం పొందారు. పట్టణంలో ఉరుసు సందర్భంగా వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆ దుకాణాలవద్ద కొనుగోళ్ల సందడి నెలకొంది. రాత్రి 12 గంటల సమయంలో దోర్నాదుల చెంచుకృష్ణయ్య నివాసం వద్ద నుంచి గంధం పట్టణ పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి శుక్రవారం తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకొని రాపూరు వారిచే చదివింపులను స్వీకరించారు. కాగా ఏఎస్పీ మనోహరాచారి దర్గాను సందర్శించారు. బందోబస్తుపై డీఎస్పీ చెంచుబాబు, అరన్‌సీఐ బాబీలకు పలు సూచనలు చేశారు.







గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హిందూ, ముస్లింలు, విద్యుత్ అలంకరణలో దర్గా, దర్గాను దర్శించుకుంటున్న భక్తులు